చికెన్ ధరలు	
లైవ్	115
డ్రెస్	170
స్కిన్‌లెస్	190
గుడ్డు డజన్	70

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.0
కనిష్ఠం	23.4

అందుబాటులోకి హాస్టల్



- రెండేళ్ల కిందట మూసివేత
- విద్యార్థినీల రాకతో పునఃప్రారంభం

8

చిట్యాలలో అదనంగా రెండు అండర్‌పాస్‌లు



చిట్యాలలో నిర్మాణంలో ఫ్లైఓవర్ పిల్లర్

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్, చిట్యాలలో ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో ఆయా చోట్ల ఈ నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే పనులు ముమ్మరంగా సాగుతుండగా చిట్యాల స్థానికులు డిమాండ్ చేయడంతో మరో రెండు అండర్‌పాస్‌ల ఏర్పాటుకు మార్కింగ్‌లు వేశారు. ఇదిలా ఉండగా చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణం సందర్భంగా కొన్ని చోట్ల తారు వేయగా, మరికొంత కంకరపరిచి వదిలేశారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

7

విజ్ఞాన దివిటీ..పుస్తకం

- పుస్తకపఠనంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే
- 50 మందిలో 4 గంటలు చదువుతున్నది తొమ్మిదిమందే
- పెరిగిన ఆన్‌లైన్ పఠనాలు




'పుస్తకం హస్తభూషణం' అంటారు పెద్దలు. అలాంటి పుస్తక పఠనం మనిషి మేధోశక్తికి చోధకంలాంటిది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో నేరుగా పుస్తక పఠనం తగ్గుముఖం పడుతోంది. పుస్తకాలు డిజిటల్ రూపంలో లభ్యం అవుతుండటంతో ఆన్‌లైన్ చదువులు పెరిగిపోయాయి. పుస్తకపఠనంపై ఆంధ్రజ్యోతి చేపట్టిన సర్వేలో ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. సర్వేలో 50 మంది పాల్గొనగా తొమ్మిది మంది నాలుగు గంటల సమయం పుస్తక పఠనానికి వెచ్చిస్తున్నారు. అందులో పత్రికలతో పాటు చరిత్ర, మోటివేషన్ పుస్తకాలు ఉన్నాయి.

6

అత్యాధునిక పరిజ్ఞానంతో స్పిల్‌వే మరమ్మతులు

- తొలుత రెండు క్రస్ట్‌గేట్ల పనులు..
- వరదను తట్టుకుంటే అన్నీ గేట్లకు.
- రీజనల్ స్పెసిఫికేషన్ మేనేజర్ కుల్‌దీప్ తివారీ
- సాగర్ జలాశయం స్పిల్‌వేపై గుంతల పరిశీలన



సాగర్ జలాశయం స్పిల్‌వేను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

నాగార్జునసాగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేపై పడిన గుంతలను గతంలో మాదిరిగా కాకుండా కొత్త పరిజ్ఞానంతో (నూతన ఫార్ములా) మరమ్మతులు చేపడతామని ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం ప్రతినిధి, రీజనల్ స్పెసిఫికేషన్ మేనేజర్ కుల్‌దీప్ తివారీ తెలిపారు. తొలుత రెండు క్రస్ట్‌గేట్ల దిగువన స్పిల్‌వేపై పనులు నిర్వహిస్తామని, ఈ ఏడాది వచ్చే వరదలకు స్పిల్‌వే తట్టుకుంటే ఆ తర్వాత మిగిలిన అన్ని గేట్ల దిగువన మరమ్మతులు చేపతామన్నారు. ప్రాజెక్టు స్పిల్‌వేపై పడిన గుంతలను ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం, మధ్యప్రదేశ్‌కు చెందిన ఎంవైకే అర్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తివారీ మాట్లాడుతూ మరమ్మతుకు ఎంతమేరకు ఖర్చు అవుతుందో నివేదికలు తయారు చేసి ఈఎన్‌సీకి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

స్పిల్‌వేకు మరమ్మతులు ఇలా..

2009 సంవత్సరంలో వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్టు స్పిల్‌వేపై భారీ గుంతలు పడ్డాయి. దీంతో 2011లో రూ.40 కోట్లతో మరమ్మతులు నిర్వహించారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ భారీ గుంతలుఏర్పడ్డాయి. దీంతో పలుమార్లు ప్రాజెక్టు ఇంజనీర్లు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులకు 2023లో రూ.19.64 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కాంట్రాక్టర్ మరమ్మతు పనులు చేసినా 2024లో ఆగస్టులో వచ్చిన కొద్దిపాటి వరదలకే స్పిల్‌వేపై మళ్లీ గుంతలు పడ్డాయి. హైదరాబాద్ జలసౌధలో నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్పిల్‌వే గుంతలు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఏప్రిల్ 18వ తేదీన స్పిల్‌వేపై పడిన గుంతలను ప్రాజెక్టు అధికారులు కొలతలు తీసి ఈఎన్‌సీకి నివేదికను అందజేశారు. స్పందించిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మధ్యప్రదేశ్‌కు చెందిన ఎంవైకే అర్మెంట్ అనే ప్రైవేటు కంపెనీని సంప్రదించగా ఆ కంపెనీ నిపుణుల బృందం సాగర్ స్పిల్‌వేపై పడిన గుంతలను పరిశీలించింది. నిపుణుల బృందంలో ప్రాజెక్టు సర్వీసెస్ హెడ్ టెక్నీషియన్ ఏఎస్ శ్రీకాంత్‌రాజ్‌ఉర్స్, రీజనల్ మేనేజర్ ఆదిత్య విక్రంవర్మ, రిపేర్ అండ్ గ్రైట్ ప్రొడక్షన్ మేనేజర్ సుజిత్ చంద్ర, ఎంవైకే అర్మెంట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎంజీ ప్రశాంత్, ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనా రాయణ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో మొదటిసారి ఆయిల్‌పామ్ తోటలో వైర్‌లెస్ ఇరిగేషన్ ఆటోమేషన్ సిస్టమ్ ఏర్పాటైంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన యువరైతు ఎం.వెంకట్‌రెడ్డి తన 12 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో వైర్‌లెస్ ఇరిగేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటలో ఇలాంటి సాంకేతిక వ్యవస్థను ఏర్పాటుచేయడం ఇదే తొలిసారి. తోటలోని ఫాం పాండ్‌లోకి బోర్ల నుంచి నీటిని నిల్వ చేసి దానిని బిందు సేద్యం ద్వారా వినియోగిస్తున్నారు. ఈ డ్రిప్ ద్వారానే ఎరువులు, పోషకాలు కూడా అందిస్తారు. ఈ విధానంతో సంబంధిత రైతు ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్నా సరే తోటలో యజమాన్య పద్ధతులు సులభంగా అమలు చేయవచ్చు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



కూలీలు లేకుండానే నీరైనా ఎరువైనా..

- రాష్ట్రంలో తొలిసారి డ్రిప్ పద్ధతిలో ఆయిల్‌పామ్ సాగు
- మాడ్గులపల్లి మండలంలో ఐవోటీ సిస్టం ఏర్పాటు
- సులభతరం కానున్న యాజమాన్య పద్ధతులు
- ఉమ్మడి జిల్లాలో రైతులకు అవగాహన కల్పనకు సన్నాహాలు

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంపై దృష్టి సారించిన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో 2,217మంది రైతులు 10,700 ఎకరాల్లో సాగు చేస్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 914మంది రైతులు 4,107 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 1,015మంది రైతులు 4,457ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,264 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగు యాజమాన్య పద్ధతులు సులభతరం చేయడం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో రాష్ట్రంలోనే మొదటిసారిగా ఐవోటీ(ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్) ద్వారా వైర్‌లెస్ ఇరిగేషన్ ఆటోమేషన్ సిస్టమ్‌ను అమలుచేశారు. దీని వల్ల ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది. సంబంధిత రైతు తోటలో లేకున్నప్పటికీ స్థానికంగా లేకున్నా వేరే ప్రాంతంలో ఉన్నా సరే ఈ ఆటోమేషన్ సిస్టమ్‌తో తోటకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించవచ్చు. ఒక మొక్కకు నీరు ఎంత అవసరం, ఫర్టిలైజర్ ఎంత ఇవ్వాలి, పోషకాలు ఎలా అందించాలనే దానిని కూడా ఉపయోగించవచ్చు. ప్రతీ ఎకరానికి ఈ టెక్నాలజీతో వాటర్ వాల్ ఏర్పాటుచేసి మొక్కలకు నీరు అందేలా చూడవచ్చు. సాగునీటితో పాటు ఎరువులు, పోషకాలను తగు మోతాదులో కలిపి ప్రతీ మొక్కకు తగినంతకు ఆటోమేటెడ్ డ్రిప్ ద్వారా అందించవచ్చు. అందుకు అనుగుణంగా ఆయా మోతాదు లో మొక్కలకు వాల్స్, మొబైల్ యాప్ ద్వారా కంట్రోల్ చేయవచ్చు. కూలీల అవసరం లేకుండానే తోటలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా నీటి యాజమాన్యాన్ని చేసుకునే వీలు ఉంటుంది. మొక్కలకు సిఫారసు చేసిన ఎరువులను ఆటోమేషన్ పద్ధతి ద్వారా అందించవచ్చు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆయిల్‌పామ్ సాగు రైతులు ఈ విధానం ద్వారా ప్రయోజనం పొందే వీలు ఉంటుంది.

ఐవోటీ సాంకేతిక ప్రక్రియతో

ఆయిల్‌పామ్ తోటల్లో ఆటోమేషన్ సిస్టమ్‌కు సంబంధించి ఐవోటీ సాంకేతిక ప్రక్రియ ద్వారా ఈ విధానం పనిచేయనుంది. అంటే సెన్సార్ ద్వారా ఇంటర్‌నెట్ వినియోగించుకొని సాధనాలను పనిచేయించవచ్చు. ఈ సాంకేతిక సాధనాల ద్వారా నేలలో తేమశాతాన్ని, ఉష్ణోగ్రతను, గాలిలో...

- మిగతా 7వ పేజీలో...

క్రైం పాయింట్

ఆన్‌లైన్ మాయాజాలం

- అమెజాన్‌లో ఇచ్చిన ఆర్డర్‌కు వేర్వేరు జత చెప్పులు

డబ్బులు డ్రా చేస్తానని మోసం

- ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి నకిలీ ఏటీఎం ఇచ్చిన దొంగ
- పట్టుకున్న పోలీసులు

నిద్రిస్తున్న మహిళను కట్టేసి

- పుస్తెలతాడు అపహరణ

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు రిమాండ్

- భార్యాభర్తలను అరెస్టు చేసిన పోలీసులు

6

వైజాగ్‌కాలనీలో ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
- పర్యాటకులు, మత్స్యకారుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్



వైజాగ్‌కాలనీలో మత్స్యకారులు, పర్యాటకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

దేవరకొండ/ నేరేడుగొమ్ము, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీ పరివాహక ప్రాంతం వైజాగ్ కాలనీలో ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కోరారు. బుధవారం నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, పరిసరాలు, స్థితిగతులను ఎస్ఐ కోటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, రికార్డులను ఆయన పరిశీలించారు. సైబర్ క్రైం, డయల్-100 వంటి వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం వైజాగ్‌కాలనీ బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, ఏఎస్పీ మౌనికతో కలిసి సందర్శించారు. ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను పరిశీలించి, నీటిలోతును అంచనా వేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈత రాకపోవడంతో కృష్ణానదిలోకి వెళ్లి మృతి చెందుతున్నారని, నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బోట్లు నడిపే నిర్వాహకులు పరిసర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. మద్యం సేవించి బోటులో ప్రయాణించవద్దని పర్యాటకులకు సూచించారు.

బోటు నిర్వాహకులు కూడా మద్యం సేవించిన వారిని బోటులో తిప్పవద్దన్నారు. ప్రతిరోజూ కృష్ణా పరివాహక ప్రాంతంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో పర్యాటకులకు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్నిచర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎస్పీతో మాట్లాడుతూ మరబోట్లకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఎస్పీ వెంట దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, సీఐ బీసన్న, ఎస్ఐ కోటేష్, తహసీల్దార్ ఉమాదేవి, అధికారులు, పర్యాటకులు ఉన్నారు.

ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టాలి



ఎడమకాల్వ లైనింగ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మిర్యాలగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఎడమకాల్వకు మరమ్మతులు చేయించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. పార్టీ నాయకులు, రైతు సంఘ నేతలతో కలిసి బుధవారం ఎడమకాల్వను పరిశీలించి, మాట్లాడారు. కాల్వ కట్టలకు లైనింగ్ లేక కోతలకు గురవుతోందని, తద్వారా నీటి వృథా జరిగే అవకాశం ఉందన్నారు. కాల్వ పరిధిలోని లైనింగ్ బలహీనంగా ఉందని, పలు చోట్ల బుంగలు పడేలా మట్టి జారిందన్నారు. కాల్వ మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామన్న మంత్రి ఉత్తమ్ నేటికీ విడుదల చేయలేదన్నారు. ఆయన వెంట రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, నాయకులు రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, మల్లు గౌతంరెడ్డి, బొగ్గారపు కృష్ణయ్య, రెమడాల బిక్షం, వలమల్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



శాలిగౌరారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ చినవెంకులు

శాలిగౌరారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చినవెంకులు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం శాలిగౌరారం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని ఎత్తివేయాలని చూస్తోందన్నారు. ఆ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు చలకాని మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సిరపంగి ఆంజనేయులు, కార్యదర్శి మక్క బుచ్చి రాములు, నాయకులు డెంకెల లింగయ్య, కల్లూరి లింగయ్య, బట్ట అవనిజ, గుండ్లపెల్లి వెంకన్న, అంకర్ల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేస్తూ అభివృద్ధి



ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేరాజగోపాల్‌రెడ్డి.

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరురూరల్, మర్రిగూడ, గట్టుప్పల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అందరికీ న్యాయం చేస్తూ అభివృద్ధి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు, మర్రిగూడ, గట్టుప్పల్ మండలాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులతో పాటు అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామం నుంచి చండూరు రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గట్టుప్పల్‌లోని ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే పరిశీలించారు. కూరగాయల మార్కెట్, ఇతర అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నామ జగనాథం, రావుల రమేష్, టేకుమట్ల శ్రీరాములు, యాదగిరిరెడ్డి, మునుగోడు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు సుజావుద్దీన్, తనంత చంద్రశేఖర్, కోడి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ సర్పంచ్ పాక నగేష్, గిరి, రాజు పాల్గొన్నారు.

యోగాలో అందరూ భాగస్వాములు కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎంవీఆర్ స్కూల్ మైదానంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగా దినోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బధవారం తన ఛాంబర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి పెద్ద సంఖ్య ప్రజలు పాల్గొనే విధంగా కృషి చేయాలని కోరారు. పలు యోగా విన్యాసాలు, యోగా గురువులకు సన్మానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆయుష్ శాఖ ప్రాజెక్టు మేనేజర్ కె, కళ్యాణ్, డీవైఎస్‌వో అక్బర్ అలీ, పీవో కృష్ణమూర్తి, డీపీవో విష్ణు,యోగా గురువులు ప్రవీణ్, భజరంగ్, కోమల పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి

చింతపల్లి,జూన్ 18 (ఆంధ్రజ్యోతి):మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామ సంఘం నూతన పాలనాధికారుల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకు నుంచి రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, ఎంఎస్ అధ్యక్షురాలు మమత, సీసీలు, సీఆర్‌పీఎస్‌లు, ఇతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి:డీఈవో

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ఉపాధ్యాయులను కోరారు. బుధవారం దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, పుస్తకాలు, నాణ్యమైన భోజనం, సాంకేతికపరమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన వెంట దేవరకొండ ఎంఈవో మాతృనాయక్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.



దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో బిక్షపతి

బకాయిలు తక్షణమే చెల్లించాలి

నల్లగొండ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రం నాయక్‌లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా రూ.154 కోట్లు బకాయి ఉన్నాయన్నారు. నల్లగొండ జిల్లాలో రూ.7 కోట్ల బిల్లులు ఉన్నాయన్నారు. ఇదే విషయమై ఈ నెల 19న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

విజ్ఞాన దివిటీ.. పుస్తకం

● విజ్ఞానం.. వికాసం



'పుస్తకాలు లేని గది ఆత్మ లేని శరీరం వంటిది' చిరిగిన చొక్కానైనా తొడుక్కో కానీ.. ఒక మంచి పుస్తకం కొనుక్కో.. అని అంటారు మహా కవి శ్రీశ్రీ. పుస్తకం ఒక స్పష్టమైన సాహిత్య దృక్పథానికి మా ర్గం చూపుతుంది. సంస్కరణ మార్గదర్శకంగా ఉంటుంది. పుస్తక పఠనంతో సామాజిక స్పృహ, నైతిక విలువలు పెంపొందుతాయి. గ్రంథాలయాలకు వెళ్లి నవలలు, కథలు, కథానికలు, ఇతర పుస్త కాలు చదివితే సమాజం పట్ల అవగాహన పెరుగుతుంది. నిరంతర పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సంపాదించవచ్చు. తాత్విక రచనలు, మహనీయుల పుస్తకాలు చదివితే జీవన శైలిలో మార్పు, సమా జంపై అవగాహన ఏర్పడుతుంది. నేడు ప్రపంచ పఠన దినం సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, పుస్తకప్రియులు తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

● పుస్తక పఠనంతో సామాజిక స్పృహ



మోత్కూరు: పుస్తక పఠనంతో సామాజిక స్పృహ, నైతిక విలువలు పెంపొందుతాయి. ఇప్పుడంతా పుస్తక పఠనం వదిలేసి టీవీలకు అలవాటు పడ్డారు. గతంలో ఎంతోమంది గ్రంథాలయాలకు వెళ్లి నవలలు, కథలు, కథానికలు, ఇతర పుస్తకాలు చదివి సమాజం పట్ల బాధ్యతగా మెలగడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేవారు. పుస్తకాలు ఇంటికి తెచ్చుకుని చదివేవారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు తప్ప గ్రంథాలయాలకు మిగతా వారు ఎక్కువగా వెళ్లడం లేదు. నేను విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు మొదట్లో ఎక్కువగా డిటెక్టివ్ నవలలు చదివేవాడిని. తర్వాత కుట్ర(రంగనాయకమ్మ), మైదానం(చలం), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనలు, తెలంగాణ ఉద్యమం సందర్భంగా జైల్లో ఉన్నప్పుడు దళారీ పశ్చాత్తాపం, రూట్స్, వామపక్ష భావజాలానికి సంబంధించిన పుస్తకాలు చదివా. అంబేడ్కర్ ఆటో బయోగ్రఫీ, దళారీ పశ్చాతాపం తదితర పుస్తకాలు నాకు స్ఫూర్తినిచ్చాయి.

- కిషోర్‌కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే.

నా జీవితాన్ని మార్చివేసిన పుస్తకం



ఆలేరు రూరల్: నా జీవితాన్ని మలుపు తిప్పిన గొప్ప పుస్తకం మహ్మద్ అలీ మాజీబీ రచించిన 'ది 8051 మైక్రో కంట్రోలర్ ఎంబెడెడ్ సిస్టమ్'. ఈ పుస్తకం చదివిన నాకు అసెంబ్లీ భాషలో ప్రోగ్రామింగ్‌పై స్పష్టమైన అవగాహన కలిగింది. ప్రోగ్రాంమింగ్ అనే పదం నాకు భయాన్ని కలిగించినా ఒక్కో చాప్టర్ చదవడంతో ప్రాక్టికల్ అవగాహన పెరిగింది. ఉదాహరణలతో, చిత్రాలతో సులభమైన వివరణలతో ఈ పుస్తకం ప్రతి విద్యార్థికీ మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ పుస్తకం ద్వారా నేర్చుకున్న జ్ఞానంతోనే ఆసు యంత్రం(ఆటోమెటిక్ మిషన్) కోసం ప్రోగ్రాం రాయగలిగా.

చింతకింది మల్లేశం, పద్మశ్రీ అవార్డు గ్రహీత. ఆసు యంత్రం సృష్టికర్త.

● నాకు భగవద్గీతే ఆదర్శం



దేవరకొండ: భగవద్గీత, రామాయణం పుస్తకాలు చదవడం నాకు నిత్య కార్యక్రమం. ఉపాధ్యాయుడిగా 36 సంవత్సరాలు పని చేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దా. 2004లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాను. ఆధ్యాత్మిక సంబంధించిన పుస్తకాలే పఠనం చేస్తా. భగవద్గీత, నిజ జీవితంలో నిత్య నైమీతిక వ్యవహారిక కర్మలను ఆచరించు చేసుకునే పరమార్థిక లాభాలు పొందే మార్గమని గీతలో ప్రచురించబడింది. మానవ సేవే మాధవసేవ అని తెల్పి చేతనైనంత సామాజికసేవ భగవద్గీత, రామాయణం పుస్తకాల స్ఫూర్తితో చేస్తున్నాను. ఆధ్యాత్మిక పుస్తకాలైన రామాయణం, మహాభారతం వంటి పుస్తకాలను చదువుతూ అందులోని భావాలను నా శిష్యులకు చెబుతూ చైతన్య పరుస్తూ ముందుకు వెళ్తున్నాను. ఎలాంటి కష్టాలు ఉన్నప్పటికీ భగవద్గీత చదివితే జీవనశైలిలో మార్పు వస్తుందని నా ప్రగాఢ నమ్మకం. సాధారణ ఉపాధ్యాయుడి నుంచి రాష్ట్రపతి నుంచి ఉత్తమ అవార్డు పొందడం నేను చదివిన భగవద్గీత, రామాయణం మహిమే.

-నర్సింహ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవరకొండ.


● కొకొ రచనలు నన్ను మార్చాయి



మిర్యాలగూడ : కొడవంటి కుటుంబ రావు తాత్విక రచనలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. అవి సమాజ దృష్టి కోణాన్ని నేర్పాయి. రావిశాస్త్రి, భగత్‌సింగ్, గ్రాంస్కీ, బాలగోపాల్ సామాజిక, చారిత్రక, తాత్విక రచనలు నన్ను మార్చివేశాయి. కళాశాలలో చదివే రోజుల్లో కొకొ రచనలు ఎక్కువగా చదివేవాడిని. ఆయన చార్లిన్‌చాప్లిన్ సినిమాలు గూర్చి రాసేటప్పుడు 'కళలు, సినిమాలు వినోదానికే పరిమితం కాకుండా మనిషి తాత్వికంగా ఎదగడానికి, పోరాడాడానికి నిరంతరం శక్తిని ఇవ్వగలిగే విధంగా వుండాలి' రావిశాస్త్రి గల్పికలు, బాలగోపాల్ రచనలు మళ్లీమళ్లీ చదవాలనిపిస్తుంది. సుశీతారు అనువదించిన గ్రాంస్కీ రచనలు, వివి రచనలు, అల్లం రాజయ్య, సాహు రాసిన కొమరం భీం పుస్తకం ప్రజా ఉద్యమాల నిర్వహణకు, అనేక అంశాలకు ఒక పరిష్కారం చూపుతాయి. ఫ్రాంజ్‌ఫనాన్ అభాగ్యజీవులు, గుగీ రచనలు చాలా సజీవంగా కనిపిస్తాయి. కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయి. బాలగోపాల్ తన రచనలో చెప్పినట్లు 'జీవితంలో చాలా ఖాళీలు వుం టాయి వాటిని పూరించడమే సాహిత్యం పని' ఇది నాకెంతో నచ్చింది.

- అంబటి నాగయ్య, టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు.

గబ్బిలం కావ్యం సామాజిక స్పృహకు తోడ్పడింది



నల్లగొండ: గబ్బిలం కావ్యం సాహిత్యం పట్ల అభిరుచిని కలిగించడమే కాక సామాజిక స్పృహతో కూడిన దృక్పథాన్ని ఏర్పరచుకోవడానికి దోహదపడింది. 'పుస్తకాలు లేని గది, ఆత్మ లేని శరీరం వంటిది' అని శ్రీశ్రీ మాటలతో ప్రేరణపొందా. సుమారు 5వేల పుస్తకాలతో వ్యక్తిగత గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నా. ప్రతీ ఇంట్లో పుస్తకాలు ఉన్నప్పుడే విజ్ఞానవంతమైన సమాజం రూపొందుతుంది. మహాకవుల పుస్తకాలతో పాటు సాహితీవేత్తల పుస్తకాలు విశ్లేషించి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందా. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కృష్ణ కౌండిన్య రాసిన 'మేర' సాహిత్యవ్యాసాలు చదివా. ఆచార్య ఆత్రేయపై, యక్షగానానికి సంబంధించిన నూతన పరిశోధన వ్యాసం ఆలోచింపజేశాయి. పరిశోధకులకు వ్యాస సంపుటి దారి దీపంగా నిలిచింది. మేర సాహిత్య వ్యాసం ఒక ఉత్తమ విమర్శ గ్రంథం. ఈ పుస్తక వ్యాస నిర్మాణంలో అనేక మెలకువలను నేర్చుకోవచ్చు .విషయ విశ్లేషణ ఎలా చేయాలో తెలుసుకోగలుగుతాం.


- సాగర్ల సత్తయ్య, సాహితీవేత్త.

ఆత్మవిశ్వాసం అలవర్చుకున్నాం


(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

పుస్తక పఠనంతో తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని యువత అభిప్రాయం వ్యక్తంచేశారు. జాతీయ పఠన దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని 50మంది యువకులతో 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా వారు తమ మనోగతాన్ని వెల్లడిస్తూ తాము రోజుకు రెండు గంటలు పుస్తక పఠనానికి కేటాయిస్తామని, తద్వారా భాషానైపుణ్యం, ఆలోచనా శక్తి, భావవ్యక్తీకరణలో మార్పులు గమనించామన్నారు. ఇందు కోసం ఎక్కువమంది ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నామని చెప్పగా, కొందరు గ్రంథాలయాలు, స్నేహితులను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. వార్తా పత్రికలు, ఆన్‌లైన్ ఆర్టికల్స్ చదువుతున్నామని వీటిలో చరిత్ర, స్ఫూర్తిదాయకమైన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తేల్చిచెప్పారు.


మీరురోజూ పుస్తకం చదివే సగటు సమయం ఎంత?




మీరు పుస్తకాలు ఎక్కడ నుంచి తెచ్చుకుంటారు?




మీరు ఎక్కువగా చదివే వేదిక ఏది?



మీరు ఏ తరహా పుస్తకాలు చదవడం ఇష్టపడతారు?



చదవడం వల్ల ఏ నైపుణ్యాలు అభివృద్ధి అయ్యాయి?



ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ.. ఆటో డ్రైవర్‌కు గాయాలు



ఆత్మకూర్(ఎస్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆటో, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్‌లో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఉప్పుల శ్రీశైలం ఆటోలో పాల డబ్బాలతో సూర్యాపేటకు వెళ్తుండగా సూర్యాపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నెమ్మికల్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్‌కు శ్రీశైలం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఆన్‌లైన్ మాయాజాలం

● అమెజాన్‌లో ఆర్డర్ చేసిన వస్తువులు తారుమారు



ఆర్డర్ చేసిన చెప్పులు, వచ్చిన చెప్పులు

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమెజాన్‌లో ఆన్‌లైన్ మాయాజాలం జరిగింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వేముల నర్సయ్య అనే యువకుడు పదిరోజుల క్రితం అమెజాన్‌లో రూ.2370లకు చెప్పులు ఆర్డర్ చేశాడు. కాగా బుధవారం డెలివరి బోయ్ చెప్పుల బాక్స్ నర్సయ్యకు అందజేశారు. డబ్బులు చెల్లించిన తర్వాతనే డెలివరీ చేయగా తీరా బాక్స్ తెరిచి చూడగా నర్సయ్య ఆర్డర్ ఇచ్చిన చెప్పులు కాకుండా పాత చెప్పు ఒకటి, మరొకటి లెదర్ షూ మోడల్ చెప్పులు ఉండడం చూసి అవాక్కయ్యాడు. వెంటనే వాటిని తిరిగి రిటర్న్ చేశాడు. అమెజాన్ లాంటి అతిపెద్ద సంస్థలో రూ.2370ల విలువచేసే చెప్పులకు ఆర్డర్ ఇస్తే పాత చెప్పులు డెలివరీ చేయడం పట్ల వినియోగదారుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

నూతనకల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఘర్షణ కేసులో కోర్టుకు హాజరు కాని నింతులను పోలీసులు బుధవారం చేశారు. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిధిలో ఎడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు సైదులు, వనం రాజు, పిట్టల కృష్ణ, బొడ్డు రాజు, నెల్లట్ల సైదుల అదే గ్రామానికి చెందిన పిట్టల ముత్తయ్య కుటుంబంపై నాలుగు సంవత్సరాల క్రితం ఘర్షణ పడ్డారు. కోర్టుకు హాజరు కాకపోవడంతో తుంగతుర్తి కోర్టు ఆదేశాల మేరకు బుధవారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఉపాధి హామీ కూలీకి గాయాలు

నూతనకల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ పిల్లలమర్రి లక్ష్మమ్మ రోజు మాదిరిగానే ఉపాధి పనులకు బుధవారం వెళ్లింది. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గడ్డపార జారి కాలు మీద పడడంతో తీవ్ర గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం నూతనకల్‌కు తరలించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

గుండాల, జూన్18(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని పాచిల్లా గ్రామానికి చెందిన తూనం అర్చన బుధవారం పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో గ్రామస్థులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని అర్చనను జనగాంలోని మాతా శిశు కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలోని సింగరాజుపల్లి వద్ద ప్రసవించింది. పాప జన్మించగా తల్లి పాప క్షేమంగా ఉన్నట్లు 108 పైలెట్ ప్రశాంత్ తెలిపారు. అనంతరం తల్లీబిడ్డను మాతాశిశు కేంద్రానికి తరలించారు.

నిద్రిస్తున్న మహిళను బంధించి..

నాగారం,జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళను బంధించి బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఈటూరు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఈటూరు గ్రామంలో నంగునూరి బయ్యమ్మ మంగళవారం రాత్రి ఆరు బయట నిద్రిస్తుండగా రాత్రి ఒంటి గంట సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బయ్యమ్మ నోట్లో వస్త్రంతో కుక్కి, రెండు చేతులను మంచానికి కట్టేసి మెడలో ఉన్న తులం పావు బంగారు నల్లపూసల గొలుసు, ఇంటి తలుపులు పగులగొట్టి పెట్టెలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును, రూ.2,500 నగదు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డబ్బులు డ్రా చేస్తానని మోసం

అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): డబ్బులు డ్రా చేసేందుకు సహకరిస్తున్నట్లు నటించి ఏటీఎంకార్డులతో పరారవుతున్న అంతర్రాష్ట్ర దొంగను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు కేసు వివరాలు వెల్లడించారు. గత సంవత్సరం నవంబరు 14వ తేదీన హుజూర్‌నగర్‌లోని యూనియన్ బ్యాంక్ వద్ద ఏటీఎంలో డబ్బులు తీసేందుకు పట్టణానికి చెందిన మంద విజయకరుణ వచ్చారు. అదే సమయంలో ఏపీలోని విజయవాడ నగరానికి చెందిన కృష్ణలంక ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ చింతల సురేష్ అక్కడికి రావడంతో ఏటీఎం నుంచి డబ్బులు తీసేందుకు సహకరించాలని కోరింది. అతను ఆమె చెప్పిన పిన్ నెంబర్‌ను ఉపయోగించి డబ్బు డ్రాచేసి డబ్బులతో పాటు నకిలీ ఏటీఎం ఇచ్చి ఒరిజినల్ ఏటీఎంకార్డు తీసుకెళ్లాడు. అనంతరం వేరే ప్రదేశాల్లో ఏటీఎం కార్డుతో రూ.లక్షా 25వేల నగదు డ్రా చేశాడు. దీంతో బాధితురాలు హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న సమయంలో సురేష్ బుధవారం మధ్యాహ్నం హుజూర్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అరెస్టు చేశారు. అతనిని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సురేష్ ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లో 44 కేసుల్లో అమాయకులను మోసగించి డబ్బులు కాజేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడి వద్ద రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎఎస్‌ఐ బలరాంరెడ్డి, పోలీసులు వరప్రసాద్, నాగరాజులను సీఐ చరమందరాజు అభినందించారు.

గోకుల్ బేకరీలో అగ్ని ప్రమాదం

● పూర్తిగా దగ్ధమైన షాపు ● రూ. 4.50 లక్షల ఆస్తినష్టం ● మిర్యాలగూడ పట్టణంలో ఘటన



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గోకుల్ బేకరీ అండ్ స్వీట్స్ దుకాణంలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితుడు రాహుల్ అగర్వాల్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద గల బేకరి షాపులో విక్రయాలు సాగిస్తున్న క్రమంలో సామాగ్రి నిల్వ ఉంచిన షాపు పై అంతస్తులో షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు వ్యాపించాయి. కొద్ది నిమిషాల వ్యవధిలోనే అగ్ని కీలలు ఎగసిపడడమేగాక, దట్టమైన పొగ వ్యాపించడంతో ఏమి జరుగుతుందోనన్న షాపులోని వినియోగదారులు, స్థానికులు భయాందోళనతో పరుగులు పెట్టారు. వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమారమిచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దుకాణంలో వ్యాపిస్తున్న మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి చాకచక్యంగా మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు గుర్తించామని ఫైర్ ఆఫీసర్ యాదగిరి తెలిపారు. ఈ ప్రమాదంలో బేకరి సమాగ్రితోపాటు ఏసీ పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించామన్నారు. కాగా అగ్ని ప్రమాదంతో సుమారు రూ. 4.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు రాహుల్ అగర్వాల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

మున్నేరువాగులో పడి కోదాడ వాసి మృతి

డోర్నకల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం మున్నేరులో ప్రమాదవశాత్తు మునిగి సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన రైల్వే ఉద్యోగి(గూడ్స్‌గార్డు) మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... డోర్నకల్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి ఎర్రంశెట్టి సందీప్(30) బుధవారం స్నేహితులతో కలిసి మున్నేరు వద్దకు వచ్చాడు. కొంతసేపటి తర్వాత నీటిలో దిగిన సందీప్ మున్నేరులో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే సందీప్ నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని సందీప్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లను రప్పించి గాలించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. సందీప్‌కు నెలల క్రితమే వివాహం జరిగిందని స్నేహితులు తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు రిమాండ్

సూర్యాపేటరూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజశేఖర్ బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామ పంచాయితీ పరిధిలోని తెట్టెకుంట తండాకు చెందిన మహిళను అదే తండాకు చెందిన బాణోతు ఉపేందర్ కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న ఉదయం 8 గంటల సమయంలో ఉపేందర్ ఆమెకు ఫోన్ చేయగా సదరు బాధితురాలి కూతురు ఫోన్ ఎత్తడంతో అసభ్యంగా తిట్టాడు. ఉపేందర్ భార్య శారద ఆమె ఇంటికి వచ్చి బాధితురాలి కూతురు ముందే ఘర్షణ పడింది. మనస్తాపం చెందిన బాధితురాలు అదే రోజు తన వ్యవసాయం పొలం దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో కుమార్తె చూసి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. 108లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ ఈ నెల 15న మృతిచెందింది. మృతురాలి భర్త బాణోతు బాలు ఫిర్యాదు మేరకు బాణోతు ఉపేందర్, అతని భార్య శారద, అతని సోదరుడు గంగరాజు, వదిన మంగమ్మలపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాణోతు ఉపేందర్, అతని భార్య శారదను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. సమావేశంలో ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

24 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వాహనంలో తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ఇద్దంపల్లి వద్ద బుధవారం పట్టుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిన వివరాల ప్రకారం.. దేవరకొండ పరిసర గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బొలెరో వాహనాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఇద్దంపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కడ్తాల్ మండలంలోని పల్లెచెలకతండాకు చెందిన బీంలాల్, దాస్ రెండు బొలెరో వాహనాల్లో ఒక్కో వాహనంలో 12క్వింటాళ్ల చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి చారకొండకు తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని, పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జరిమానా

కనగల్, జూన్18(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి నల్లగొండ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి రాము బుధవారం జైలు శిక్ష, జరిమానా విధించారు. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... గుర్రంపోడు మండలం కొప్పొల్ గ్రామానికి చెందిన చింతల నాగయ్య ఈ నెల 16వ తేదీన మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడుపుతూ కనగల్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడికి కోర్టు రూ. వెయ్యి జరిమానా, ఒక రోజు జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష జరిమాన తప్పదని హెచ్చరించారు.

చింతపండు చోరీ ఘటనపై నేడు నివేదిక?

యాదగిరిగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరికొండపైన ఇటీవల జరిగిన చింతపండు దొంగతనం కేసులో దోషులను తేల్చేందుకు దేవాదాయ అదనపు కమిషనర్ నేతృత్వంలో హైలెవల్ కమిటీ విచారించింది. రెండు రోజుల పాటు విచారణ చేసిన కమిటీ సభ్యులు గురువారం నివేదిక అందజేయనున్నట్లు తెలిసింది. అధికారులు, ఉద్యోగులను వేర్వేరుగా విచారించి ఎంతకాలంగా దొంగతనం జరుగుతుంది? అని ప్రశ్నించారు. కాగా, నమోదు చేసుకున్న నివేదిక పట్ల దేవస్థానంలో చర్చనీయాంశమైంది. దేవస్థానం అధికారుల ఫిర్యాదు మేరకు మధు, గణేష్ ఇద్దరు నిందితుల వాంగ్మూలానికి తోడు మరో నింది తుడిగా భావిస్తున్న దిలీప్ కూడా వంటస్వాముల ప్రోద్బలంతోనే దొంగతనానికి పాల్పడినట్లు చెప్పగా, ప్రసాదాల తయారీలో పనిచేసిన వంటస్వాములను బాధ్యులను చేసి అలసత్వం కింద చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

విజిలెన్స్ తనిఖీలు

వార్షిక తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అధికారులు బుధవారం కొండపై తనిఖీలు చేపట్టారు. ఉదయం ఇక్కడకు చేరుకున్న అధికారులు దేవస్థాన పరిధిలో ప్రీ ఆడిట్, పోస్టు ఆడిట్ ఎప్పటి వరకు జరిగాయి? టెండర్లల్లో దేవాదాయ కమిషనర్ అనుమతి ఉందా? లేదా? అనే అంశాలను తనిఖీ నిర్వహించారు. ప్రసాదాల తయారీలో ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? తదితర అంశాలను కూడా పరిశీలించారు. ప్రభుత్వానికి నిర్ణయించిన చెల్లింపులు చేస్తున్నారా? లేదా? ఆడిట్ నివేదికను అనుసరిస్తున్నారా? అంశాలను పరిశీలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా



బీబీనగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఈత సరదా ప్రాణం తీసింది. ఈ సంఘ టన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని మల్లికార్జున్ కాలనీకి చెందిన వెల్ల నందకుమార్ (23) డ్రైవర్. ఆయనకు ఇటీవల వివాహం జరిగింది. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో బీబీనగర్ చెరువు వద్ద ఆగి సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి ప్రాణాలు వదిలారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చేపట్టి నందకుమార్ మృత దేహాన్ని బయటికి తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ క్షణం వరకు తమతో ఆనందంగా గడిపిన నందకుమార్ కళ్ల మూసి తెరిచేలోగా ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నందకుమార్ తల్లి ఇంద్రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముమ్మరంగా ఫ్లైఓవర్ పనులు

» శరవేగంగా సాగుతున్న నిర్మాణాలు » అదనంగా రెండు అండర్ పాస్‌ల ఏర్పాటు



చిట్యాలలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

చిట్యాల, జూన్ 18, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు రూ.45కోట్ల అంచనా వ్యయంతో పట్టణంలో 1200 మీటర్ల పొడవు నిర్మించనున్న బ్రిడ్జి పనులు చురుకుగా సాగుతున్నాయి. సిమెంట్ పిల్లర్ల నిర్మాణం పూర్తి కావస్తుంది. మట్టికట్ట నిర్మాణం కోసం సిమెంట్ పలకలు బిగిస్తున్నారు. గతంలో హైవే విస్తరించే సమయంలో ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రతిపాదించినా కొంతమంది వ్యతిరేకించడంతో ఉపసంహరించుకున్నారు. ఫ్లైఓవర్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతుండటంతో మళ్లీ ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. చిట్యాలతో పాటు పెద్దకాపర్తిలో కూడ ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తున్నారు.

అదనంగా రెండు అండర్‌పాస్‌లు

చిట్యాలలో ఫ్లైఓవర్ నిర్మాణం 1200 దూరం నిర్మించాలని మధ్యలో పోలీస్‌స్టేషన్ వద్ద అండర్‌పాస్ ఇవ్వాలని ప్లాన్‌లో ఉంది. కాగా ఒక అండర్‌పాస్ సరిపోదని మరో రెండు అండర్‌పాస్‌లు ఇవ్వాలని చిట్యాల అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్ణయించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. దీంతో వారు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదించి మరో అండర్‌పాసులు మంజూరు చేయాలని కోరారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు రెండు అండర్‌పాస్‌లు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించగా వారు మార్కింగ్ చేశారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



చిట్యాలలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి. సర్వీస్ రోడ్డు నుంచి ట్రాఫిక్ మళ్లించడంతో దుమ్ము, ధూళి ఎగిసి ఇబ్బందిపడుతున్నాం. రోడ్డు క్రాస్ చేయడానికి చాలా ఇబ్బందిగా ఉంది.

- ఇరుకుల్ల శ్రీనివాస్, చిట్యాల

హైవే సర్వీస్ రోడ్లు అస్తవ్యస్తం..

» ప్రమాదకరంగా మారిన కంకర రాళ్లు
» గాయపడుతున్న పాదచారులు, చిరువ్యాపారులు



చౌటుప్పల్ లోని హైవే సర్వీస్ రోడ్లలో ప్రమాదకరంగా మారిన కంకర రాళ్లు

చౌటుప్పల్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని హైవేపై ఫ్లై ఓవర్‌ను నిర్మించేందుకు ముందుగా ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో సర్వీస్ రోడ్లను పునర్నిర్మించే పనులను చేపట్టారు. ఫ్లై ఓవర్‌ను నిర్మించే సమయంలో వాహనాల రాకపోకలు ఈ సర్వీస్ రోడ్ల వెంటనే సాగనున్నాయి. అందుకోసం కొన్ని సర్వీస్ రోడ్లను విస్తరించడం, పునర్నిర్మించడం వంటి పనులను చేపట్టారు. ఆ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో తారు రోడ్డు నిర్మాణం చేసి, మరి కొన్ని ప్రాంతాల్లో కంకర వేసి వదిలివేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. 2024 జూన్ 20వ తేదీన నుంచి ప్రారంభమైన సర్వీస్ రోడ్ల పునర్నిర్మాణ పనులు ఏడాదవుతున్నా పూర్తి కాకపోవడంతో వాహనదారులు, పాదచారులు, చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక సర్వీస్ రోడ్ల వెంట ఉన్న దుకాణదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. వాహనాల రాకపోకలతో దుకాణాల్లోకి విపరీతంగా దుమ్ము దూరడం, కంకర రాళ్లు ఎగిరివచ్చి పడటం, తరచుగా అద్దాలు పగిలిపోవడం, వినియోగదారుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఇబ్బందికరంగా ఉండటం వంటి అనేక సమస్యలను దుకాణదారులు ఎదుర్కొంటున్నారు. సర్వీస్ రోడ్ల పునర్నిర్మాణంలో జరుగుతున్న తీవ్రమైన జాప్యంపై స్థానికులు మండిపడుతున్నారు.

సర్వీస్ రోడ్డుకు అడ్డంకిగా ఈద్గా

హైవే ఉత్తరభాగం సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ఒక ప్రాంతంలో దర్గా అడ్డంకి మారింది. దీంతో సుమారు 50 మీటర్ల పొడవున సర్వీస్ రోడ్డును నిర్మించలేదు. ఈ ప్రాంతంలో హైవేపై వాహనాలు రాంగ్ రూట్‌లో వస్తుండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దర్గాను తొలగించి సర్వీస్ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ ప్రాంతంలో గత నెల 5వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు దర్గాను తొలగించకుంటే ప్రమాణికుల సౌకర్యార్థం తామే తొలగిస్తామని హెచ్చరించారు.

సర్వీస్ రోడ్ల పనులు పూర్తికాక ఇబ్బందులు



హైవే సర్వీస్ రోడ్ల పునర్నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో కంకరపరిచి తారు నిర్మాణం చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వాహనాలు వెళ్తున్నప్పుడు కంకరరాళ్లు ఎగిరి వచ్చి చిరు వ్యాపారులు, పాదచారులకు తగిలి గాయాలపాలవుతున్నారు. మూడు నెలలుగా నిర్మాణ పనులను నిలిపివేయడంతో కంకర పరిచిన ప్రాంతాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

- కడారి కల్పన యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు, చౌటుప్పల్

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు వెండిజోడు సేవలు జరిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 27,74,656 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న పండితులు

మఠంపల్లి,జూన్ 18(ఆంధ్రజ్యోతి) : మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు .అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం



ఓపెన్ కెనాల్ నిర్వాసితులకు పరిహారం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని డిండి, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి లిఫ్ట్ స్కీం ప్రాజెక్టుల కింద భూములు, ఇళ్లు కోల్పోతున్న భూనిర్వాసితులందరికీ పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పిస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏకేబీఆర్ లిఫ్ట్ ప్రాజెక్టు, పెండ్లిపాకల ఓపెన్‌కెనాల్ భూనిర్వాసితులు 12 మందికి మంజూరైన రూ. 68 లక్షల భూపరిహారం చెక్కు లను పంపిణీ చేశారు. ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ ద్వారా భూములు కోల్పోతున్న 45 మంది నిర్వాసితులకు రూ.11.6 కోట్లు చెక్కులను అందజేశారు. చిలకమర్రి, బాలాజీనగర్ గ్రామానికి చెందిన బాధితులకు 57 కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు.

ప్రాజెక్టుల కింద భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణానికి భూనిర్వాసితులు సహకరించాలన్నారు కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జమునామాధవరెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ ఈఈ నెహ్రూ నాయక్, డీఈ నాగయ్య, సిరాజ్ ఖాన్, ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, అధికారులు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

సూర్యాపేట - పల్నాడు జిల్లాలకు బస్సు సౌకర్యం

» తెలుగు రాష్ట్రాల మధ్య బస్సు సర్వీసు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

తెలుగు రాష్ట్రాల మధ్య పల్లె వెలుగు బస్సును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. సూర్యాపేట-పల్నాడు జిల్లాల మధ్య అధికారులు పల్లెవెలుగు బస్సును ప్రారంభించారు. మే 24న ఆంధ్రజ్యోతిలో 'వంతెన ఉన్నా బస్సులు ఏవీ" అనే వార్త కథనానికి అధికారులు స్పందించారు. కోదాడ ఆర్టీసీ డిపో అధికారులు ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు రీజనల్ మేనేజర్‌తో మాట్లాడి రెండు రాష్ట్రాల మధ్య బస్సును కోదాడ డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. 2013లో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో రూ. 50 కోట్లతో మట్టపల్లి వద్ద లక్ష్మీనర్సింహాస్వామి బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించగా 2014 నాటికి పూర్తి చేశారు. నేటికీ ఈ వంతెనను అధికారికంగా ప్రారంభించకపోయినా రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు జరుగుతున్నాయి. మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో 2013లో ఈ వంతెనకు ఉమ్మడి ఏపీ గవర్నర్‌గా ఉన్న నర్సింహన్ శంకుస్థాపన చేశారు. గడిచిన 12 ఏళ్లుగా బ్రిడ్జి పూర్తిచేసినా ఆర్టీ సీ అధికారులు ఈ వంతెన మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించలేదు. పన్నెండేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉత్తమ్ ఆదేశాల మేరకు బస్సు రవాణా సౌకర్యం కల్పించడం గమనార్హం.

ప్రయాణం ఇలా..

కోదాడ నుంచి చిలుకూరు, హుజూర్‌నగర్, మఠంపల్లి, పెదవీడు, మట్టపల్లి లక్ష్మీనర్సింహా స్వామి వంతెన మీదుగా ఏపీలోని పల్నా డు జిల్లాలో గల తంగెడ, ముత్యాలంపాడు, దాచేపల్లి వరకు అధికారులు బస్సు సౌకర్యాన్ని ప్రారంభించడం విశేషం. కోదాడ నుంచి హుజూర్‌నగర్ మీదుగా దాచేపల్లి వరకు 58 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాగా ప్రతి రోజు కోదాడ నుంచి ఉదయం 7.30 నుంచి బయలుదేరి 9 గంటలకు దాచేపల్లికి చేరుకుంటుంది. కాగా తిరిగి ప్రతిరోజు మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యం కల్పించారు.

గతంలో దాచేపల్లికి వెళ్లాలంటే హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడ మీదుగా దాచేపల్లికి వెళ్లాల్సి ఉండేది. బస్సు సౌకర్యం కల్పించడంతో తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం మెరుగు పడిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పిస్తాం

తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతనంగా ఆర్టీసి బస్సును ప్రారంభించాము. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఆర్టీసీలోనే ప్రయాణికులకు భద్రత ఉంటుంది. ఆటోలు ఆశ్రయించి లేనిపోని ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితంగా ఉంటుంది.

- శ్రీనివాసరావు ,కోదాడ డిపో మేనేజర్



దాచేపల్లికి ఆర్టీసి బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

దాచేపల్లికి బస్సు సర్వీస్ ప్రారంభం

కోదాడ రూరల్, మఠంపల్లి : ప్రయాణికుల సౌకర్యార్థం హుజూర్‌నగర్ నుంచి దాచేపల్లి వరకు బస్సు సర్వీస్‌ను డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సర్వీసు హుజూర్‌నగర్ నుంచి దాచేపల్లికి మూడు ట్రిప్పులు నడపబడనున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్ నుంచి ఉదయం 8, మధ్యాహ్నం 12, 3.55 గంటలకు బయలుదేరుతుందని, దాచేపల్లి నుంచి ఉదయం 9.55 గంటలకు మధ్యాహ్నం 2.10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, మట్టపల్లి నుంచి దాచేపల్లికి ఉదయం 8.55 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు, 4.55 గంటలకు నడపబడనన్నారు. హుజూర్‌నగర్ నుంచి దాచేపల్లి వరకు చార్జీ రూ. 60 ఉంటుందని, ప్రయాణికులు ప్రైవేటు వాహనాలు ఎక్కకుండా ఆర్టీసీని ఆదరించాలని కోరారు. బస్సు విచారణ కోసం 9959226302 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఆలయ భూములకు రికార్డు స్థాయిలో కౌలు

» లింగగిరి ఆలయ భూముల బహిరంగ వేలం
» ఎకరానికి రూ.30 నుంచి 50 వేలకు పెరిగిన కౌలు



బహిరంగం వేలంలో పాల్గొన్న రైతులు, అధికారులు

హుజూర్‌నగర్ , జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు కౌలు రికార్డు స్థాయిలో వచ్చింది. గతంలో ఎకరానికి రూ.30వేలు ఉండగా ఈసారి రూ.50,200లకు పెరిగింది. ఎకరానికి రూ.20వేలకు పెరగడంతో ఇది ఆలయ చరిత్రలోనే అత్యధిక కౌలుగా దేవాదాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. బుధవారం ఆలయ భూ ములు ఉన్న శ్రీనివాసపురం భూముల్లో అధికారులు 28 ఎకరాల 38 గుంటలకు సంబంధించి వేలం నిర్వహించగా దాదాపుగా రూ.12.57 లక్షల ఆదాయం వచ్చింది. వీటిల్లో ఎకరానికి రూ.50,200ల చొప్పున ఆదాయం లభించినట్లు ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. యాసంగి, వానాకాలం సీజన్లకు కలిపి రూ.50వేల పైచిలుకు రావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు పోటీపడి కౌలు దక్కించుకున్నారు. 28. 38 ఎకరాల భూమిని 6 బిట్లుగా విభజించారు. మొదటి బిట్టు 4 ఎకరాలు పార్థబోయిన నర్సింహారావు రూ. 1.92 లక్ష, రెండో బిట్టు 5 ఎకరాలు గడ్డం రాజు రూ.2.47 లక్షలు, మూడో బిట్టు 5 ఎకరాలు చలమల సతీష్‌నాయుడు రూ.2. 61 లక్షలు, నాలుగో బిట్టు 5 ఎకరాలు జింకల ఉపేందర్ రూ.2.43 లక్షలు, ఐదవ బిట్టు 5 ఎకరాలు ముక్కా భిక్షం రూ. 2.62 లక్షలు, ఆరో బిట్టు 4.38 ఎరాలు, కడియాల కిరణ్‌కుమార్ రూ.52వేలు చొప్పున కౌలు దక్కించుకున్నట్లు ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. బూరుగడ్డ ఈఓ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మంగులు, కట్టా గోపాల్‌రావుచౌదరి, యండీ నిజాముద్దీన్, చలమల రాఘవయ్య, ఈడ్పుగంటి వెంకటేశ్వరరావు, తోకల శ్రీను, ఉపేందర్ పాల్గొన్నారు.

నిత్యపూజా కైంకర్యాలు

యాదగిరిగుట్ట సమాచారం

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ : ఉదయం 3.30-4 గంటల వరకు
ఆరాధన : 4-4.30వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15-6.15, **పుష్పాలంకరణ సేవ:** 5.30-6.00
సహస్రనామార్చనలు: 6.15 నుంచి 7 గంటల వరకు
రాజభోగం: 11.45-12.30, మధ్యాహ్నం 3-4 గంటలవరకు ఆలయం మూసివేత
తిరువారాధన:సాయంత్రం 7-7.45, **సహస్రనామార్చన:**రాత్రి 7.30-8.15
ఆరగింపు: 9-9.45, **శయనోత్సవ దర్శనం:** 9.30- 9.45ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 6-7.30, 10-11.45 సాయంత్రం 5-7,రాత్రి 8.15-9
వీఐపీ దర్శనాల వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు

కూలీలు లేకుండానే నీరైనా, ఎరువైనా

(5వ పేజీ తరువాయి)

తేమశాతం పోషకాల లభ్యత వంటి అంశాలు ఎప్పటికప్పుడూ సాంకేతిక పరిజ్ఞానంతో తెలియజేస్తుంది. భూమిలో నాటిన ఆయిల్ పామ్ మొక్కకు కావాల్సిన మోతాదు మేరకు పోషకాలను డ్రిప్ ద్వారా అందించడానికి ఉపకరిస్తుంది. తద్వారా పోషకాల వినియోగాన్ని సమర్థంగా నియంత్రిస్తూ అమలుచేస్తుంది. విద్యుత్ ఓల్టేజీ సమస్యతో మోటార్లు చెడిపోకుండా ఓల్టేజీ మానిటరింగ్ ప్రక్రియ ద్వారా ఈ విధానం కాపాడుతుంది. అదేవిధంగా 50శాతం నీటి ఆదా, ఎరువుల ఆదా చేస్తూ అధిక దిగుబడులకు నాణ్యత గల పంటలు రావడానికి ఐవోటీ సాంకేతిక ప్రక్రియ తోడ్పడుతుంది. అతేకాకుండా నీటి మోతాదును యూఎస్‌డీఏ సూచనల ప్రకారం ప్రోగ్రామింగ్ చేసిన యంత్రాల ద్వారా సమయానుకూలంగా అందించవచ్చు. ఈ వ్యవస్థకు ఒకసారి టైమింగ్ సెట్ చేస్తే ఏడాది పొడవునా ప్రతిరోజూ అదే సమయానికి వాల్‌లు, మోటార్లు ఆటోమెటిక్‌గా ఆన్ ఆఫ్ అవుతాయి.

అనుముల మండలంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 18,264ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో ఉంది. అదనంగా మరో 15వేల ఎకరాల్లో సాగుకు రైతులు ముందుకు వస్తే త్వరలో జిల్లాలో ఆయిల్‌పామ్ కంపెనినీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో పాటు సంబంధిత కంపెనీ హామీ ఇచ్చినట్లుగానే సన్నాహాలు చేయనున్నారు. ఇందులో భాగంగా అనుముల మండలం యాచారం గ్రామంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇప్పటికే 25 ఎకరాల వరకు సేకరించింది. మరో కొంత భూమిని కూడా కొనుగోలు చేయడానికి నిర్ణయించారు. యాచారంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో పాటు అందులో కొన్ని ఎకరాలల్లో ఆయిల్‌పామ్ తోటను ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కల్పించడానికి, శిక్షణ తరగతులు నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఒక్కో ఎకరానికి 10 నుంచి 12టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. గతంలో ఆయిల్‌పామ్ కంపెనీనీ హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ-సూర్యాపేట జిల్లాల మధ్యలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినా భూమి కొనుగోలుకు అందుబాటులో లేకపోవడంతో అనుముల మండలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం దిగుబడులను ఖమ్మం జిల్లాతో పాటు విజయవాడ ప్రాంతానికి ఆయా కంపెనీలు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం తోటలు వేస్తున్న రైతులు మార్కెటింగ్ సమస్యపై అయోమయానికి గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం భరోసా ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడంతో పాటు పంటలు వేసిన రైతులు ఎట్టి పరిస్థితులల్లోను నష్టపోయేది లేదని స్పష్టత ఇస్తుంది. ఈ తోటల సాగు సులభం కావడంతో పాటు ఆయిల్‌పామ్ తోటలు పండించిన రైతులతో కంపెనీలు ఒప్పందం చేసుకుంటున్నాయి. ధరలు సైతం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడూ ధర నిర్ణయిస్తుండటంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆయిల్ పామ్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని నిర్ణయించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నీటి వనరులు అధికంగా ఉండటంతో తోటలు విస్తరించాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ. 18,700పైగా ఉండగా ఏడాదికి ఎకరానికి రూ.1.50 లక్షల ఆదా యం పొందే అవకాశాలు ఉన్నాయి. ఖర్చులు ఎకరానికి సుమారు రూ.60వేలు ఉండగా వరి పంటతో పోలిస్తే 7 నుండి 8 రెట్ల అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు.



ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న అనంతరెడ్డి

నీటి యాజమాన్యంలో ఇది సరికొత్త అధ్యయనం

నీటి యాజమాన్య పద్ధతుల్లో ఇది సరికొత్త అధ్యయనమని చెప్పవచ్చు. రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ విధానాన్ని ఇతర రైతులు కూడా అనుసరిస్తే సాగు ఖర్చులు తగ్గించుకొని దిగుబడిని పెంచుకోవచ్చు. అత్యాధునిక సాగు విధానాలను రైతులు అందిపుచ్చుకోవాలి. ఆయిల్‌పామ్ తోటల్లో వైర్‌లెస్ ఇరిగేషన్ ఆటోమేషన్ సిస్టమ్ రైతులకు భవిష్యత్తులో ప్రయోజనకరంగా మారనుంది. సాగునీరు, ఎరువులను ఈ విధానంతో సమర్థవంతంగా వినియోగించవచ్చు. ఈ సాంకేతిక వ్యవస్థను ప్రారంభించడం వల్ల ఆయిల్‌పామ్ రైతులకు ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రస్తుతం 4వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఆయిల్‌పామ్ తోటకు సంబంధించి ఎకరానికి 3 టన్నుల దిగుబడి వస్తుంది.

-పిన్నపురెడ్డి అనంతరెడ్డి, జిల్లాఉద్యాన శాఖ అధికారి నల్లగొండ

క్రికెట్ పోటీల్లో కేకేఆర్ యూత్ విజయం



విజేతలకు బహుమతి అందిస్తున్న సాముల రామిరెడ్డి

హుజూర్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జి ల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంప్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి క్రికెట్ టోర్నమెం ట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో హుజూర్‌నగర్‌కు చెందిన కేకేఆర్ యూత్, సాముల రామిరెడ్డి యువసేన ఆధ్వర్యంలో పోటీ పడ్డారు. ఫైనల్ మ్యాచ్‌లో కేకేఆర్ యూత్ విజయం సాధించింది. కేకేఆర్ యూత్ కెప్టెన్ గుంజ పిచ్చయ్య క్రీడాకారులకు రూ.50 వేల నగదు, మెమెంటో, కప్ అందజేశారు. రాంబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ద్వితీయ బహుమతి రామిరెడ్డి యువసేన కెప్టెన్ కృష్ణకు రూ.30వేల నగదు బహుమతి అందజేశారు. మూడో బహుమతి మట్టపల్లిరావు యూత్ గెల్చుకుంది. నాలుగో బహుమతి 11 బుల్లెట్స్ టీమ్ గెలుపొందింది. గెలుపొందిన క్రీడాకారులకు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నవీన్, బాబా, కృష్ణ, నర్సింహారావు, రవి, హుస్సేన్, భాస్కర్, శ్రీకాంత్, కిరణ్, సాయి పాల్గొన్నారు.

రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సత్తిరెడ్డి

నల్లగొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైదాబాద్‌రోడ్డులోని శ్రీరాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం నూతన పాలకవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అక్కినపల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో కమిటీ గౌరవాధ్యక్షుడిగా అక్కినపల్లి మీనయ్య, అధ్యక్షుడిగా యెడ్ల సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నిమ్మల పిచ్చయ్య, కోశాధికారి రేకల కృష్ణయ్య, ఉపకార్యదర్శి శ్రీమన్నారాయణ, సభ్యులుగా రామలింగం, రాజేష్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రాములు, భద్రయ్య, రామస్వామి ఎన్నుకున్నారు.

ప్రత్యేకాధికారిగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



కనగల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారిగా పి.సుబ్బారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం, అధికారులు అండాలు, గోవర్ధన్ పాల్గొన్నారు.

అందుబాటులోకి హాస్టల్



బాలికల హాస్టల్‌ను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కర్ణశ్రీ

పునః ప్రారంభమైన ఎస్సీ బాలికల వసతి గృహం

నాంపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత బాలికలను చదువుతో పాటు హాస్టల్ సౌకర్యం కల్పిస్తే వారు చదువుకుంటారని భావించి ప్రభుత్వం హాస్టళ్లను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సుమారు 40 సంవత్సరాల క్రితం మండలకేంద్రంలో బాలికల కోసం ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేసింది. కానీ సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహించింది. ఆ అద్దె భవనంలోనే చుట్టుపక్కల గ్రామాల బాలికలతో పాటు పలు మండలాలకు చెందిన బాలికలు హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసించారు. 2006లో అప్పటి ప్రభుత్వం మండల కేంద్రంలో లక్షలు ఖర్చు చేసి పక్కా భవనం నిర్మించింది. హాస్టల్‌లో ఉండి చదువుతూ ఇక్కడ చదువు పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. హాస్టల్‌లో సిబ్బంది కొరత కారణంగా మూడు, నాలుగు హాస్టళ్లకు ఇన్‌చార్జీలను నియమించడంతో వార్డెన్లకు పని భారం పెరిగింది. దీంతో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం పెరగడంతో క్రమక్రమంగా హాస్టల్‌లో బాలికల శాతం తగ్గుతూ వచ్చింది. విద్యార్థినులు తక్కువ మంది ఉండటంతో ఎస్సీ బాలికల హాస్టల్‌ను అధికారులు రెండేళ్ల పాటు మూసివేశారు. మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ ఉండటంతో అందులో చదివే బాలికలు హాస్టల్ వసతి లేకపోవడంతో కొందరు మధ్యలో చదువు మానేసి ఇంటి దగ్గరేఉంటూ కూలీ పనులకు పోతున్నారు. బస్సు సౌకర్యం ఉన్న బాలికలు బాలికలు బస్సుల్లో, లేని వారు ప్రైవేట్ వాహనాలపై వచ్చి చదువుకునేవారు. ఈ నేపథ్యంలో బాలికల హాస్టల్ పునఃప్రారంభించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తూ పాఠశాలలకు వచ్చే బాలికలకు హాస్టల్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం కల్పించే ఈ వసతి సౌకర్యాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలో 3 నుంచి 10వతరగతి చదివే బాలికలను కూడా వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

రుచికరమైన ఆహారం, స్టడీమెటీరియల్

ఈ వసతిగృహంలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం సంవత్సరానికి సరిపడా నోట్ పుస్తకాలు, నాలుగు జతల స్కూల్ యూనిఫామ్స్, బెడ్ షీట్స్, స్టడీ మెటీరియల్, బూట్లు పదో తరగతి చదివే బాలికలకు ప్రత్యేకంగా ట్యూషన్, సన్న బియ్యంతో రుచికరమైన భోజనంతో పాటు వారంలో ఐదు సార్లు గుడ్లు, పండ్లు, రెండుసార్లు చికెన్, ప్రతీ ఉదయం రాగిజావతో పాటు కిచిడి, పులిహోర, జీరా రైస్, టమాటా రైస్ ఆదివారం ఇడ్లీ అందించనునన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



అధికారుల సహకారంతో ఎస్సీ బాలికల వసతిగృహాన్ని పునఃప్రారంభమవుతుంది. వసతి గృహానికి సొంత భవనం ఉంది. హాస్టల్‌లో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఈ హాస్టల్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే బాలికలు కూడా చేరవచ్చు. ఎస్సీ బాలికలే కాకుండా ఎస్టీ, బీసీ ఇతరులు కూడా ఈ హాస్టల్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- గుండాల లింగయ్య, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్, నాంపల్లి

బాలికల వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కర్ణశ్రీ

నాంపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ బాలికల వసతిగృహాన్ని బాలికలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని దేవరకొండ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కర్ణ శ్రీ అన్నారు. రెండేళ్లుగా మూసివేసి ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌ను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు చదివే బాలికలు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర కులాలకు చెందిన బాలికలు కూడా ఈ హాస్టల్ వసతిని ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వం బాలికలు విద్యారంగంతో పాటు అన్ని రంగాల్లో రాణించడానికి ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ హాస్టల్‌లో స్టడీ మెటీరియల్‌తో పాటు రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నందున బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యారంగంలో రాణిస్తూ ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణశర్మ, ఎంఈవో మల్లికార్జునరావు, హాస్టల్ వార్డెన్లు గుండాల లింగయ్య, జయరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కనగల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిమర్రి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల, రాంచంద్రాపురం గ్రామ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులను బుధవారం అందజేశారు. మండలంలోని పగిడిమర్రి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్‌సెల్ కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని గోలి బ్రదర్స్ జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేయటం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. అంతకుముందు కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని రాంచంద్రాపురం గ్రామ ఎంపీపీఎస్ పాఠశాలలో లయన్స్‌క్లబ్ రాయల్ నల్లగొండ అధ్యక్షుడు ఎర్రబెల్లి నర్సిరెడ్డి, కార్యదర్శి కొప్పుల సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నన్నూరి మురళీమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కేసాని వెంకట్‌రెడ్డి కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మి, హెచ్‌ఎం చంద్రమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమాచారం

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

నల్లగొండ, జూన్18(ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని ఆయూష్ డిపార్ట్‌మెంట్ హోమియో డాక్టర్ తయ్యాబా కౌసర్ అన్నారు. పట్టణ సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో బుధవారం యోగా మాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతీ ఒక్కరూ గంటసేపు యోగా అభ్యాసం చేయడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఆహార నియమాలు, శారీరక వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు యోగాసనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు కె.భజరంగ్‌ప్రసాద్, సింగం ప్రవీణ్‌కుమార్, వైష్ణవి, కోమల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, టీచర్లు కృష్ణ, సంజయ్, వరలక్ష్మి, జ్యోతి, పద్మ, నిషాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

స్తూపం ఆవిష్కరణ

చిట్యాలరూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం చిన్నకాపర్తికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఈరమళ్ళ చంద్రయ్య స్మారకస్తూపాన్ని బుధవారం ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజాసమస్యల పరిష్కారంలో చంద్రయ్య ఎనలేని కృషి చేశారని కొనియాడారు. పార్టీ పక్షాన నిలబడిన ఆయనపై ఇతర పార్టీల వారు అన్యాయంగా కేసులు పెడితే జైలుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో ఐతరాజు నర్సింహ, కత్తుల లింగస్వామి, కోనేటి రాములు, రుద్రారపు పార్వతమ్మ, వీరమళ్ల వెంకటేశం, రూపని ఇద్దయ్య, శిర్పు హన్మయ్య, రుద్రారపు బిక్షం, విష్ణుమూర్తి, దేశపాక సైదులు, మామిడి గణేష్, విష్ణుమూర్తి, ముత్తయ్య, శంకరయ్య, నర్సింహ, అంజయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శాలిగౌరారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన గిరిగాని నరేష్ తుడిమిడిలో ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మరణించాడు. తుడిమిడి గ్రామ ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మృతుడు గిరిగాని నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. యూనియన్ ఆధ్వర్యంలో వారికి రూ.85వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, చిత్తలూరు మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న నోట్‌బుక్స్ సీజ్

నార్కట్‌పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని శ్రీ చైతన్య ప్రైవేట్ పాఠశాలలో అక్రమంగా విక్రయిస్తున్న నోట్ బుక్స్ ఇతర మెటీరియల్‌ను మండల విద్యాశాఖ సిబ్బంది బుధవారం సీజ్ చేశారు. పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా బుక్స్ తదితర స్టడీ మెటీరియల్‌ను విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల రాందేవ్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పరిశీలించగా ఓ గదిలో నోటు బుక్స్, టెక్స్ట్‌బుక్స్, బ్యాగులు ఇతర సామగ్రిని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఎంఈవో కూకుట్ల నర్సింహకు ఫిర్యాదు చేయడంతో ఎంఈవో ఆదేశాల మేరకు సీఆర్‌పీ కృష్ణయ్య పాఠశాలకు వచ్చి పుస్తకాలు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా మోదీ రాందేవ్ మాట్లాడుతూ ఫీజుల పేరిట పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల రక్తం తాగుతున్నాయని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అధికారులు సమర్థంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, నాయకులు భాస్కర్, విజయ్ కుమార్‌రెడ్డి, విష్ణుగౌడ్, వినయ్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో బోధన

మునుగోడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం, ఆటపాటలతో విద్యా బోధన సద్వినియోగపరుచుకోవాలని పలువురు కోరారు. అమ్మమాట- అంగన్‌వాడీ బాటలో భాగంగా బుధవారం ఊకొండి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులందరికీ అక్షరాభ్యాసం చేయించారు. పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతను వివరిస్తూ తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్‌ఎం భద్రయ్య, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఎస్.సుమలత, లింగమ్మ, ఉమారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలత ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలి



కనగల్: లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎంపీడీవో జయరాం

కనగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొలత ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ఎంపీడీవో జయరాం లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కురంపల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఓర్సు వెంటయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి

నాంపల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని హౌసింగ్ ఏఈ ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని దామెర గ్రామంలో ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన అధికారులతో కలిసి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా చేపట్టి పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దామెర యాదగిరి, నాయకులు బత్తుల వెంకటయ్య, తల్లోజు నరసింహచారి, కడారి పెద్దులు, రాజశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

మర్రిగూడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో మున్నయ్య అన్నారు. మర్రిగూడ మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ముగ్గు వేసి ఇంటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన విధంగానే గృహ నిర్మాణాలను చేపట్టాలని అన్నారు. వానాకాలం నేపథ్యంలో లబ్ధిదారులు పనులను వేగవంతం చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ దశలో ఉన్న వారికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రవికుమార్ హౌజింగ్ ఏఈ నవీన్, గ్రామ సెక్రటరీ శ్రవణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మేతర యాదయ్య, మాజీ సర్పంచ్ మాడం శాంతమ్మ వెంకటయ్య, జమ్ముల వెంకటేష్, గ్యార వెంకటేష్, సిరిపంగ శ్రీనివాస్, అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి మాస కల్యాణం



వేణుగోపాలస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి మాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి వేంకటాచార్యులు, కృష్ణమాచార్యులు పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కల్యాణతంతులో పలువురు దంపతులు కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వేడుకలో దేవస్థాన చైర్మన్ దోసపాటి ప్రసాద్, నాయకులు ఐతరాజు రమేష్, పసునూరి పాండురంగయ్య, పసునూరి శ్రీనివాస్, సామ కొండల్‌రెడ్డి, శివ, దోసపాటి విష్ణు, బండారు రమేష్, పబ్బతి శేఖర్, రాధారపు విజయలక్ష్మి, రంగా కృష్ణయ్య, కోటయ్య పాల్గొన్నారు.

రైతు భరోసాను సద్వినియోగం చేసుకోవాలి

● చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ

మునుగోడురూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు రైతుభరోసాను సద్వినియోగం చేసుకోవాలని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ అన్నారు. మండలంలోని పులిపల్పుల గ్రామ రైతు వేదికలో బుధవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో వానాకాలం సీజన్‌కు ముందుగా రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరాకు రూ.6 వేలు రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు రైతులు కొనుగోలు చేసుకోవడానికి సరైన సమయంలో ప్రభుత్వం రైతు భరోసా అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మాదగోని నరసింహ, రైతులు దంతం లింగారెడ్డి, యాదయ్య, లింగస్వామి, మదర్ సాబ్, యాదమ్మ స్వామి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో పాలన సాగిస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతుభరోసా సంవత్సరానికి రూ. 15 వేలు ఇస్తామని మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసీఆర్ జమ చేసిన డబ్బులను కూడా రైతులకు ఇవ్వలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తున్నాయని రైతుభరోసా ఇస్తుందని అన్నారు. ఒక్కొక్క రైతుకు ప్రభుత్వం రూ.30 వేలు బాకీ ఉందన్నారు. యాసంగిలో ఉమ్మడి జిల్లా రైతులకే రూ.800కోట్లు బాకీ పడిందని అన్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు చేతకాని వాళ్లలా మిగిలిపోయారని, వారిద్దరూ జిల్లాకు ఏమీ చేయలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో చేస్తున్న విచారణ అంతా బూటకమని కక్షతోనే కేసీఆర్‌కు పదేపదే నోటీసులు ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన బీఆర్ఎస్ భయపడదని, ప్రజల్లో ఉండి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



సభ్యులకు అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి

తిప్పర్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా అభివృద్ధి జరుగుతుందని ఏపీడీ శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన పదాధికారుల శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా సంఘం బాధ్యతలు చేపట్టిన వీవోఏలు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. సంఘం నిర్వహణ, విధి, విధానాలపై పలు సూచనలు చేశారు. సంఘ సభ్యులు ప్రతీ మహిళ సభ్యురాలికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో రామలింగయ్య, ఎస్ఆర్పీ నాగలక్ష్మి, ఏపీఎం శ్రీదేవి, సీసీలు, వీవోలు, సంఘ సభ్యురాలు పాల్గొన్నారు.

బండమీదిగూడెం రోడ్డులో గుంతల పూడ్చివేత



బండమీదిగూడెం రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న యువకులు

శాలిగౌరారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఊట్కూరు నుంచి బండమీదిగూడెం వరకు ఉన్న రెండు కిలోమీటర్ల దూరంలో అస్తవ్యస్తంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది మారింది. ద్విచక్ర వాహనాలు కూడా ఈ రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డుపై, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రయాణం చేసినప్పుడల్లా త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేస్తామని హామీ ఇస్తున్నారే తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదు. కానీ ఏండ్లు గడిచిన కనీసం తట్ట మట్టి కూడా పోయలేదు. అధికారులు, పాలకులు ఈ రోడ్డుకు మరమ్మతులు ఇక చేయరు అని నిర్ధారించుకున్న ఆ గ్రామ యువకులు, ట్రాక్టర్ డ్రైవర్లు ఏకమై రోడ్డును బాగుచేసుకున్నారు. గ్రామ యువకులు, ట్రాక్టర్ల డ్రైవర్లు నడుము బిగించి గుంతలను స్వచ్ఛందంగా పూడ్చారు. సుమారు 20 ట్రాక్టర్ల మట్టిని గుంతల్లో నింపి మరమ్మతులు చేసుకున్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



దామెర బీమనపల్లి పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మర్రిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యుఎల్ఆర్ఎఫ్ (యూనివర్సల్ లెర్నర్స్ రీసోర్స్ ఫౌండేషన్) చైర్మన్ ఉదావత్ లచ్చిరాం ఆధ్వర్యంలో బుధవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. సుమారు రూ. 5వేల విలువైన క్రీడా సామగ్రిని పాఠశాల విద్యార్థులకు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై. మంజులత, కొండ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్థులు

కొరటికల్‌లో వానరానికి అంత్యక్రియలు

నల్లగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో గ్రామస్థులు ఓ వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఓ వానరం కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో తిరుగుతూ ప్రజలతో కలివిడిగా ఉండేది. బుధవారం మధ్యాహ్నం మర్రిచెట్టు పైనుంచి కిందపడటంతో తీవ్రగాయాలై మృతి చెందింది. బుధవారం రాత్రి గ్రామ వీధుల్లో బాణసంచా కాల్చుతూ, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు. అనంతరం వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వానరం మృతి తమను కలిచివేసిందని, ఊరంతా ఏకమై ఘనంగా వీడ్కోలు పలికామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని సుమారు నాలుగు వందల మంది పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి

కట్టంగూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రహదారులు అధ్వానంగా మారాయని, వాటికి మరమ్మతులు చేయాలని బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు బత్తిని నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 65 నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎరసానిగూడెం, పరడ, చెరువుఅన్నారం నుంచి తొట్లవారిగూడెం, అక్కలాయిగూడెం, కురుమర్తికి గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతు పనులు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక అయిటిపాముల శివారులోని జాతీయ రహదారిపై లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నామని అక్కడ లైట్లు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గున్నాల నాగరాజు, నాయకులు చొక్కాల చరణ్, శ్రవణ్, నాగరాజు, చందు, గోపి పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

చిట్యాలరూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేస్తారని పెద్దకాపర్తి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ఆయన తన కుమార్తెతో పాటు పలువురు చిన్నారులను జడ్పీహెచ్‌ఎస్‌లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదివిస్తే వేల రూపాయలు మిగులుతాయని అన్నారు. ప్రతీ ఒక్కరూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. వారికి హెచ్‌ఎం లుకేందర్‌రెడ్డి అడ్మిషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నీలకంఠం లింగస్వామి, ఆనగంటి సైదులు, గుండెపురి లింగస్వామి, నర్సింహ, విజయ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
లైవ్	115
డ్రెస్	170
స్కిన్‌లెస్	190
గుడ్డు డజన్	70
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.0
కనిష్ఠం	23.4

విధులకు అనుమతించాలని..

● మునిసిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

8

చిట్యాలలో అదనంగా రెండు అండర్‌పాస్‌లు



చిట్యాలలో నిర్మాణంలో ఫ్లైఓవర్ పిల్లర్

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్, చిట్యాలలో ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో ఆయా చోట్ల ఈ నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే పనులు ముమ్మరంగా సాగుతుండగా చిట్యాల స్థానికులు డిమాండ్ చేయడంతో మరో రెండు అండర్‌పాస్‌ల ఏర్పాటుకు మార్కింగ్‌లు వేశారు. ఇదిలా ఉండగా చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణం సందర్భంగా కొన్ని చోట్ల తారు వేయగా, మరికొంత కంకరపరిచి వదిలేశారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

7

విజ్ఞాన దివిటీ..పుస్తకం

- పుస్తకపఠనంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే
- 50 మందిలో 4 గంటలు చదువుతున్నది తొమ్మిదిమందే
- పెరిగిన ఆన్‌లైన్ పఠనాలు




'పుస్తకం హస్తభూషణం' అంటారు పెద్దలు. అలాంటి పుస్తక పఠనం మనిషి మేథోశక్తికి చోదకంలాంటిది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో నేరుగా పుస్తక పఠనం తగ్గుముఖం పడుతోంది. పుస్తకాలు డిజిటల్ రూపంలో లభ్యం అవుతుండటంతో ఆన్‌లైన్ చదువులు పెరిగిపోయాయి. పుస్తకపఠనంపై ఆంధ్రజ్యోతి చేపట్టిన సర్వేలో ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. సర్వేలో 50 మంది పాల్గొనగా తొమ్మిది మంది నాలుగు గంటల సమయం పుస్తక పఠనానికి వెచ్చిస్తున్నారు. అందులో పత్రికలతో పాటు చరిత్ర, మోటివేషన్ పుస్తకాలు ఉన్నాయి.

6

అత్యాధునిక పరిజ్ఞానంతో స్పిల్‌వే మరమ్మతులు

- తొలుత రెండు క్రస్ట్‌గేట్ల పనులు..
- వరదను తట్టుకుంటే అన్నీ గేట్లకు.
- రీజినల్ స్పెసిఫికేషన్ మేనేజర్ కుల్‌దీప్ తివారీ
- సాగర్ జలాశయం స్పిల్‌వేపై గుంతల పరిశీలన



సాగర్ జలాశయం స్పిల్‌వేను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

నాగార్జునసాగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేపై పడిన గుంతలను గతంలో మాదిరిగా కాకుండా కొత్త పరిజ్ఞానంతో (నూతన ఫార్ములా) మరమ్మతులు చేపడతామని ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం ప్రతినిధి, రీజనల్ స్పెసిఫికేషన్ మేనేజర్ కుల్‌దీప్ తివారీ తెలిపారు. తొలుత రెండు క్రస్ట్‌గేట్ల దిగువన స్పిల్‌వేపై పనులు నిర్వహిస్తామని, ఈ ఏడాది వచ్చే వరదలకు స్పిల్‌వే తట్టుకుంటే ఆ తర్వాత మిగిలిన అన్ని గేట్ల దిగువన మరమ్మతులు చేపతామన్నారు. ప్రాజెక్టు స్పిల్‌వేపై పడిన గుంతలను ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం, మధ్యప్రదేశ్‌కు చెందిన ఎంవైకే అర్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తివారీ మాట్లాడుతూ మరమ్మతుకు ఎంతమేరకు ఖర్చు అవుతుందో నివేదికలు తయారు చేసి ఈఎన్‌సీకి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

స్పిల్‌వేకు మరమ్మతులు ఇలా..

2009 సంవత్సరంలో వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్టు స్పిల్‌వేపై భారీ గుంతలు పడ్డాయి. దీంతో 2011లో రూ.40 కోట్లతో మరమ్మతులు నిర్వహించారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ భారీ గుంతలుఏర్పడ్డాయి. దీంతో పలు మార్లు ప్రాజెక్టు ఇంజనీర్లు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులకు 2023లో రూ.19.64 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కాంట్రాక్టర్ మరమ్మతు పనులు చేసినా 2024లో ఆగస్టులో వచ్చిన కొద్దిపాటి వరదలకే స్పిల్‌వేపై మళ్లీ గుంతలు పడ్డాయి. హైదరాబాద్ జలసౌధలో నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్పిల్‌వే గుంతలు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఏప్రిల్ 18వ తేదీన స్పిల్‌వేపై పడిన గుంతలను ప్రాజెక్టు అధికారులు కొలతలు తీసి ఈఎన్‌సీకి నివేదికను అందజేశారు. స్పందించిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మధ్యప్రదేశ్‌కు చెందిన ఏంవైకే అర్మంట్ అనే ప్రైవేటు కంపెనీని సంప్రదించగా ఆ కంపెనీ నిపుణుల బృందం సాగర్ స్పిల్‌వేపై పడిన గుంతలను పరిశీలించింది. నిపుణుల బృందంలో ప్రాజెక్టు సర్వీసెస్ హెడ్ టెక్నీషియన్ ఏఎన్ శ్రీకాంత్‌రాజ్‌ఉర్స్, రీజనల్ మేనేజర్ ఆదిత్య విక్రంవర్మ, రిపేర్ అండ్ గ్రైట్ ప్రొడక్షన్ మేనేజర్ సుజిత్ చంద్ర, ఎంవైకే అర్మంట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎంజీ ప్రశాంత్, ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనా రాయణ తదితరులు ఉన్నారు.

కూలీలు లేకుండానే నీరైనా ఎరువైనా..

తెలంగాణలో మొదటిసారి ఆయిల్‌పామ్ తోటలో వైర్‌లెస్ ఇరిగేషన్ ఆటోమేషన్ సిస్టమ్ ఏర్పాటైంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన యువరైతు ఎం.వెంకట్‌రెడ్డి తన 12 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో వైర్‌లెస్ ఇరిగేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటలో ఇలాంటి సాంకేతిక వ్యవస్థను ఏర్పాటుచేయడం ఇదే తొలిసారి. తోటలోని ఫాం పాండ్‌లోకి బోర్ల నుంచి నీటిని నిల్వ చేసి దానిని బిందు సేద్యం ద్వారా వినియోగిస్తున్నారు. ఈ డ్రిప్ ద్వారానే ఎరువులు, పోషకాలు కూడా అందిస్తారు.ఈ విధానంతో సంబంధిత రైతు ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్నా సరే తోటలో యజమాన్య పద్ధతులు సులభంగా అమలు చేయవచ్చు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



- రాష్ట్రంలో తొలిసారి డ్రిప్ పద్ధతిలో ఆయిల్‌పామ్ సాగు
- మాడ్గులపల్లి మండలంలో ఐవోటీ సిస్టం ఏర్పాటు
- సులభతరం కానున్న యాజమాన్య పద్ధతులు
- ఉమ్మడి జిల్లాలో రైతులకు అవగాహన కల్పనకు సన్నాహాలు

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంపై దృష్టి సారించిన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో 2,217మంది రైతులు 10,700 ఎకరాల్లో సాగు చేస్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 914మంది రైతులు 4,107 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 1,015మంది రైతులు 4,457ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,264 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగు యాజమాన్య పద్ధతులు సులభతరం చేయడం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో రాష్ట్రంలోనే మొదటిసారిగా ఐవోటీ(ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్) ద్వారా వైర్‌లెస్ ఇరిగేషన్ ఆటోమేషన్ సిస్టమ్‌ను అమలుచేశారు. దీని వల్ల ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది. సంబంధిత రైతు తోటలో లేకున్నప్పటికీ స్థానికంగా లేకున్నా వేరే ప్రాంతంలో ఉన్నా సరే ఈ ఆటోమేషన్ సిస్టమ్‌తో తోటకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించవచ్చు. ఒక మొక్కకు నీరు ఎంత అవసరం, ఫర్టిలైజర్ ఎంత ఇవ్వాలి, పోషకాలు ఎలా అందించాలనే దానిని కూడా ఉపయోగించవచ్చు. ప్రతీ ఎకరానికి ఈ టెక్నాలజీతో వాటర్ వాల్ ఏర్పాటుచేసి మొక్కలకు నీరు అందేలా చూడవచ్చు. సాగునీటితో పాటు ఎరువులు, పోషకాలను తగు మోతాదులో కలిపి ప్రతీ మొక్కకు తగినంతకు ఆటోమేటెడ్ డ్రిప్ ద్వారా అందించవచ్చు. అందుకు అనుగుణంగా ఆయా మోతాదు లో మొక్కలకు వాల్స్, మొబైల్ యాప్ ద్వారా కంట్రోల్ చేయవచ్చు. కూలీల అవసరం లేకుండానే తోటలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా నీటి యాజమాన్యాన్ని చేసుకునే వీలు ఉంటుంది. మొక్కలకు సిఫారసు చేసిన ఎరువులను ఆటోమేషన్ పద్ధతి ద్వారా అందించవచ్చు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆయిల్‌పామ్ సాగు రైతులు ఈ విధానం ద్వారా ప్రయోజనం పొందే వీలు ఉంటుంది.

ఐవోటీ సాంకేతిక ప్రక్రియతో

ఆయిల్‌పామ్ తోటల్లో ఆటోమేషన్ సిస్టమ్‌కు సంబంధించి ఐవోటీ సాంకేతిక ప్రక్రియ ద్వారా ఈ విధానం పనిచేయనుంది. అంటే సెన్సార్ ద్వారా ఇంటర్‌నెట్ వినియోగించుకొని సాధనాలను పనిచేయించవచ్చు. ఈ సాంకేతిక సాధనాల ద్వారా నేలలో తేమశాతాన్ని, ఉష్ణోగ్రతను, గాలిలో...

- మిగతా 7వ పేజీలో...

క్రైం పాయింట్

ఆన్‌లైన్ మాయాజాలం

● అమెజాన్‌లో ఇచ్చిన ఆర్డర్‌కు వేర్వేరు జత చెప్పులు

డబ్బులు డ్రా చేస్తానని మోసం

● ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి నకిలీ ఏటీఎం ఇచ్చిన దొంగ
● పట్టుకున్న పోలీసులు

నిద్రిస్తున్న మహిళను కట్టేసి

● పుస్తెలతాడు అపహరణ

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు రిమాండ్

● భార్యాభర్తలను అరెస్టు చేసిన పోలీసులు

6

వైజాగ్‌కాలనీలో ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
- పర్యాటకులు, మత్స్యకారుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్



వైజాగ్‌కాలనీలో మత్స్యకారులు, పర్యాటకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

దేవరకొండ/ నేరేడుగొమ్ము, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీ పరివాహక ప్రాంతం వైజాగ్ కాలనీలో ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కోరారు. బుధవారం నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, పరిసరాలు, స్థితిగతులను ఎస్ఐ కోటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, రికార్డులను ఆయన పరిశీలించారు. సైబర్ క్రైం, డయల్-100 వంటి వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం వైజాగ్‌కాలనీ బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, ఏఎస్పీ మౌనికతో కలిసి సందర్శించారు. ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను పరిశీలించి, నీటిలోతును అంచనా వేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈత రాకపోవడంతో కృష్ణానదిలోకి వెళ్లి మృతి చెందుతున్నారని, నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బోట్లు నడిపే నిర్వాహకులు పరిసర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. మద్యం సేవించి బోటులో ప్రయాణించవద్దని పర్యాటకులకు సూచించారు.

బోటు నిర్వాహకులు కూడా మద్యం సేవించిన వారిని బోటులో తిప్పవద్దన్నారు. ప్రతిరోజూ కృష్ణా పరివాహక ప్రాంతంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో పర్యాటకులకు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్నిచర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎస్పీతో మాట్లాడుతూ మరబోట్లకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఎస్పీ వెంట దేవరకొడ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, సీఐ బీసన్న, ఎస్ఐ కోటేష్, తహసీల్దార్ ఉమాదేవి, అధికారులు, పర్యాటకులు ఉన్నారు.

ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టాలి



ఎడమకాల్వ లైనింగ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మిర్యాలగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఎడమకాల్వకు మరమ్మతులు చేయించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. పార్టీ నాయకులు, రైతు సంఘ నేతలతో కలిసి బుధవారం ఎడమకాల్వను పరిశీలించి, మాట్లాడారు. కాల్వ కట్టలకు లైనింగ్ లేక కోతలకు గురవుతోందని, తద్వారా నీటి వృథా జరిగే అవకాశం ఉందన్నారు. కాల్వ పరిధిలోని లైనింగ్ బలహీనంగా ఉందని, పలు చోట్ల బుంగులు పడేలా మట్టి జారిందన్నారు. కాల్వ మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామన్న మంత్రి ఉత్తమ్ నేటికీ విడుదల చేయలేదన్నారు. ఆయన వెంట రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, నాయకులు రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, మల్లు గౌతంరెడ్డి, బొగ్గారపు కృష్ణయ్య, రెమడాల బిక్షం, వలమల్ల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



శాలిగౌరారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ చినవెంకులు

శాలిగౌరారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చినవెంకులు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం శాలిగౌరారం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని ఎత్తివేయాలని చూస్తోందన్నారు. ఆ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు చలకాని మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సిరపంగి ఆంజనేయులు, కార్యదర్శి మక్క బుచ్చి రాములు, నాయకులు డెంకెల లింగయ్య, కల్లూరి లింగయ్య, బట్ట అవనిజ, గుండ్లపెల్లి వెంకన్న, అంకర్ల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేస్తూ అభివృద్ధి



ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేరాజగోపాల్‌రెడ్డి.

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరురూరల్, మర్రిగూడ, గట్టుప్పల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అందరికీ న్యాయం చేస్తూ అభివృద్ధి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు, మర్రిగూడ, గట్టుప్పల్ మండలాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులతో పాటు అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామం నుంచి చండూరు రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గట్టుప్పల్‌లోని ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే పరిశీలించారు. కూరగాయల మార్కెట్, ఇతర అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నామ జగనాధం, రావుల రమేష్, టేకుమట్ల శ్రీరాములు, యాదగిరిరెడ్డి, మునుగోడు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు సుజావుద్దీన్, తనంత చంద్రశేఖర్, కోడి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ సర్పంచ్ పాక నగేష్, గిరి, రాజు పాల్గొన్నారు.

యోగాలో అందరూ భాగస్వాములు కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎంవీఆర్ స్కూల్ మైదానంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగా దినోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి పెద్ద సంఖ్య ప్రజలు పాల్గొనే విధంగా కృషి చేయాలని కోరారు. పలు యోగా విన్యాసాలు, యోగా గురువులకు సన్మానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆయుష్ శాఖ ప్రాజెక్టు మేనేజర్ కె, కళ్యాణ్, డీవైఎస్‌వో అక్బర్ అలీ, పీవో కృష్ణమూర్తి, డీపీవో విష్ణు,యోగా గురువులు ప్రవీణ్, భజరంగ్, కోమల పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి

చింతపల్లి,జూన్ 18 (ఆంధ్రజ్యోతి):మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామ సంఘం నూతన పాలనాధికారుల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకు నుంచి రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, ఎంఎస్ అధ్యక్షురాలు మమత, సీసీలు, సీఆర్‌పీఎస్‌లు, ఇతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి:డీఈవో



దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో బిక్షపతి

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ఉపాధ్యాయులను కోరారు. బుధవారం దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, పుస్తకాలు, నాణ్యమైన భోజనం, సాంకేతికపరమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన వెంట దేవరకొండ ఎంఈవో మాతృనాయక్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

నల్లగొండ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రం నాయక్‌లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా రూ.154 కోట్లు బకాయి ఉన్నాయన్నారు. నల్లగొండ జిల్లాలో రూ.7 కోట్ల బిల్లులు ఉన్నాయన్నారు. ఇదే విషయమై ఈ నెల 19న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

పుస్తకాల పంపిణీ పూర్తి : ఎంఈవో

మిర్యాలగూడ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థులందరికీ పుస్తకాల పంపిణీ పూర్తి అయినట్లు ఎంఈవో లాహూరి బాలు తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందించామన్నారు. పుస్తకాలపై విద్యాశాఖ బార్‌కోడ్ ముద్రించిందని, పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్పకు అభిషేకం

చింతపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ ఎదురుగా నెలకొన్న అయ్యప్ప ఆలయంలో బుధవారం భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, సుబ్రమణ్యస్వామికి అభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, బాదేపల్లి శ్రీకాంత్ గౌడ్, శేఖర్, ఉడుతల శివ, ఆకుతోట గిరి, హరిష్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు

మిర్యాలగూడ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాద్గార్‌పల్లి శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి, పర్వతవర్ధిని సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాన పూర్వక పంచామృతాభిషేకాలు, 8గంటలకు చెన్నకేశవస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు ఉద 11 గంటలకు శ్రీదేవిభూదేవి చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాయంత్రం 5గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు అనంతరం పవళింపు సేవ ఉంటుందని అన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి కార్యక్రమాలకు విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న మాజీ సర్పంచులు

చింతపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తీదేడు మాజీ సర్పంచులు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండలంలోని తీదేడు(వెంకటంపేట)కు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ...పార్టీలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టుడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశోక్, కాంగ్రెస్ తీదేడు గ్రామ శాఖ అధ్యక్షుడు శివర్ల శంకర్‌యాదవ్, పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు గడువు రేపు ఆఖరు

చింతపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు సంబంధించి గడువు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణికుమారి బుధవారం తెలిపారు. గ్రామాల్లో రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను ఏఈవోలకు అందించాలని ఆమె తెలిపారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూములపై హక్కులు కల్పించాలి



హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న కల్యాణ్‌నాయక్

డిండి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతుల ఆధీనంలో ఉన్న నీటిపారుదలశాఖ భూములపై హక్కులు కల్పించాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ ఎస్టీ కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్‌నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో బీసీ కమిషన్ సభ్యులు ఆచారి ఇచ్చిన నివేదికకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు ఇయరింగ్ ఏర్పాటు చేసి న్యాయం చేయాల పేర్కొన్నారు. స్పందించిన జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు పది రోజుల్లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని కమిషన్ సభ్యులు హామీ ఇచ్చినట్లు కళ్యాణ్‌నాయక్ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మొక్కలు నాటి మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి రవినాయక్

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు స్థిరమైన దిగుబడులు పొందవచ్చునని దేవరకొండ డివిజన్ ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి రవినాయక్ అన్నారు. మండలంలోని కొండభీమనపల్లి జనార్దన్‌రావు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌లో మొక్కలునాటి మాట్లాడారు. ఆయిల్ పామ్ దిగుబడులను మార్కెట్‌కు సంబంధంలేకుండా కంపెనీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఎకరం వరిసాగు నీటితో మూడు ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారులు శేఖర్, ప్రకాష్, కృష్ణయ్య, రైతులు నవీన్, భాస్కర్, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా డాక్యుమెంటరీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, యూనుస్ పర్వానాలు

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లా వందేళ్లచరిత్రపై డాక్యుమెంటరీ ఫిలీం పోస్టర్‌ను దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌శంకర్, యూనుస్ పర్వానా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వందేళ్ల చరిత్ర కలిగిన దేవరకొండ ఖిల్లా ఫొటోలను సేకరించి డాక్యుమెంటరీ ఫిలింను తయారు చేయడం అభినందనీయమని పర్యాటకులు యూనుస్ పర్వానా అన్నారు. ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ లైఫ్ ఇన్ ఏ సెంచరీ ఏ1 డాక్యుమెంటరీ ఫిలీం ఫొటోలను సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాజు, అధికారులు రాకేష్, సత్తార్, వార్డు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

తిరుమలగిరి(సాగర్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రం-3లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాల్లో తల్లిదండ్రులు చేర్పించాలని సూచించారు. తద్వారా చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య అందుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీలో చేర్పడం వల్ల పౌష్టికాహారం పిల్లలకు అందడం వల్ల ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు రమణ, కళావతి, పుష్ప, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

మిర్యాలగూడ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పరిపాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. మోదీ పాలన పదకొండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు మేలు చేసేలా కేంద్రప్రభుత్వం పథకాలు రూ పొందించిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ చేసిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. టూటౌన్ కార్యదర్శి పెదబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బంటు సైదు లు, కొండేటి సరిత, ఎడ్ల రమేష్, గుండ్లపల్లి శ్రీకాంత్, పురుషోత్తంరెడ్డి, శివ, లక్ష్మణ్‌సింగ్, సోములు, యా దగిరి, గిరి, సోమలింగం, భాగ్యమ్మ, రేణుక పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై అమృత్ వికసిత్ భారత్ సంకల్ప సభను బీజేపీ నందికొండ అధ్యక్షుడు ఎర్రబోయిన రాజు ఆధ్వర్యంలో సాగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 యేళ్ల ప్రధాని మోదీ తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో దేశం ఎంతో అభివృద్ధి చెందింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను గ్రామాల్లో ప్రచా రం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా గ్రామ పంచాయతీ చేరడంతోనే గ్రామాలు అభివృద్ధి ప థంలో పయనిస్తున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి మహిళా సాధికారత స్వావలంబనకు కేంద్రం కృషి చేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ రక్షణకు తిరుగులేదని నిరూపితమైందన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొమ్ము రాందాసు, కౌన్సిల్ సభ్యుడు గణేష్ తంగరాజు, పట్టణ ఉపాధ్యక్షురాలు జయమ్మ, కేఎన్ సుమ, రమణ, పద్మారెడ్డి, విక్రం, రమణమ్మ పాల్గొన్నారు.



మిర్యాలగూడ లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



సాగర్ సభలో మాట్లాడుతున్న ఎర్రబోయిన రాజు

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి



పెద్దవూరలో ప్రచారం చేస్తున్న హాలియా కళాశాల అధ్యాపకులు

పెద్దవూర, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు చేరి నాణ్యమైన విద్యను పొందాలని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీర్‌హుస్సేన్ అన్నారు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పెద్దవూర మండల కేంద్రంలో అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు ప్రతి ఏటా విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు అందచేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి పై తరగతుల్లో చేరితో ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తున్నందునఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు శిల్ప, ఆదిరెడ్డి, వెంకట్‌నాయక్, బాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం

● ఆటోలో తిరుగుతూ తండాల్లో అవగాహన



ప్రచారం చేస్తున్న రాజేష్

తిరుమలగిరి(సాగర్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి... వారి భవిష్యత్తుకు మేము బాట లు వేస్తాం అంటూ రంగుండ్ల తండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రేవల్లి రాజేష్ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఆటోకు బ్యానర్ కట్టుకొని తండాలోని పలు వీ. దుల్లో తిరుగుతూ కూడళ్లలో మైక్ ద్వారా పాఠశాల ప్రత్యేకతల గురించి స్థానికులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తున్నా డు. తండాలోని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందజేస్తున్నట్లు దీనివల్లే గతేడాది ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల ఐదుగురు విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించారని తెలిపారు. మ ధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రభుత్వ పాఠశాలల్లోనే మీ పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేస్తూ వినూత్నంగా ప్రచారం చేస్తుండడంపై స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



కొండమల్లేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఉండడంతో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్డు మధ్యలో బుల్లోడ్స్ ఏర్పాటు చేయించారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టరీత్య చర్యలు ఉంటా యని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. మొదటి విడతగా ఇందిరమ్మ ఇల్లు రాని వారు అధైర్య పడొద్దన్నారు. విడతల వారీగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందంపేట తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీవో లక్ష్మి, ముత్యాల సర్వయ్య, అధికారులు, పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కొల్‌ముంతలపహాడ్ రైతు వేదిక సమీపంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి కృషి చేస్తున్నారని, ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునామాధవవరెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, దూదిపాల వేణుశ్రీధర్‌రెడ్డి, ఆలంపల్లి నర్సిం హా, వేమన్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి, డీఈ శైలజ, ఎంఈవో నాగేశ్వర్‌నాయక్, ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఏఈ లష్కర్, ప్రిన్సిపాల్ సరళ, కొర్ర రాంసింగ్‌నాయక్, మంగ్యానాయక్ పాల్గొన్నారు.



చందంపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

విధులకు అనుమతించాలని..



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికురాలు, మద్దతుదారులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విధులకు అనుమతించాలని మునిసిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికురాలు రామాంజి జ్యోతి నిరసన వ్యక్తం చేసింది. దశాబ్దంన్నర కాలంగా మునిసిపాలిటీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న తనను అకారణంగా విధుల నుంచి తొలగించారని ఆరోపించింది. కార్మికురాలికి మద్దతు తెలిపిన ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ 33వ వార్డులో స్వీపర్‌గా పని చేస్తున్న జ్యోతిని 2024 నంవబర్ నుంచి విధులకు అనుమతించడం లేదన్నారు. మునిసిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చుట్టూ ప్రదక్షిణాలు చేయగా మేలో విధులకు అనుమతించారని, పక్షం రోజుల అనంతరం తిరిగి విధుల నుంచి తొలగించారన్నారు. ఇదే విషయాన్ని సబ్ కలెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారిని కలిసి వివరించగా, జ్యోతిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఫార్సు చేశారన్నారు. అయినప్పటికీ కమిషనర్, శానిటరీ ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జ్యోతిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జ్యోతి కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులతో కలిసి కార్యాలయం ఎదుట బైఠాయించారు ఈ విషయమై కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ కార్మికుల పట్ల ఎలాంటి వివక్షత చూపడం లేదని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విధుల్లోకి అనుమతిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సందీప్, ఇమానియేల్, భరత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ విభాగ ఆర్టీసీ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి కోరారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంస్థలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, కృష్ణయ్య, రాములు, బాలయ్య, రాంచంద్రయ్య, ఎస్ఎంరెడ్డి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మిర్యాలగూడ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని నిడమనూరు పీహెచ్‌సీ యోగా శిక్షకురాలు గంధం శైలజ అన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని అవంతీపురం గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులతో యోగా చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, నాగరాణి, నాగసుధా, స్రవంతి, శృతి, పీడీ సునీత పాల్గొన్నారు.

వీల్ చైర్ క్రికెట్ పోటీల్లో సురేష్ ప్రతిభ



నిర్వాహకుల నుంచి రివార్డు అందుకుంటున్న సురేష్

తిరుమలగిరి(సాగర్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఐడబ్ల్యూపీఎల్ వీల్ చైర్ క్రికెట్ పోటీల్లో మండలంలోని రం గుండ్లతండాకు చెందిన ధరావత్ సురేష్ ప్రతిభను చాటా డు. న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలు ఈనెల 15న ముగిశాయి. ఫైనల్‌లో హైదరాబాద్ హరికేన్ జట్టు దబాంగ్ ఢిల్లీతో తలపడి ద్వితీ య స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్ హరికేన్ జట్టు తరుపున వైస్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించిన ధరావత్ సురేష్ ఫైనల్ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో 62 పరుగులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో ట్రోఫి నిర్వాహకులు సురేష్‌కు రూ.5వేల క్యాష్ రివార్డు అందచేసి సన్మానించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

లక్‌పతి, ఏవో, చందంపేట



వానాకాలం సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని వ్యవసాయ అధికారి లక్‌పతి తెలిపారు. వానాకాలంలో ఎలాంటి పంటలు తదితర విషయాలు బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో వెల్లడించారు

(ఆంధ్రజ్యోతి- చందంపేట)

ఆంధ్రజ్యోతి: వానాకాలంలోఎలాంటి పంటలు ఎంపిక చేసు కోవాలి?

ఏవో: భూసారాన్ని అనుసరించి పత్తి, పప్పుదినుసులు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయాలను సాగు చేయాలి.

ఆంధ్రజ్యోతి: పంటల దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటీ ?

ఏవో: భూమికి బలాన్ని ఇచ్చే జనుము, జీలుగ పంటలను సాగు చేసి భూమిలో కలియ దున్నాలి.

ఆంధ్రజ్యోతి: చీడ,పీడల నివారణకు ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏవో: పంటలు సాగుచేసి చీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసు కోవాలి. పంట మార్పిడి చేయాలి.

ఆంధ్రజ్యోతి: కల్తీ విత్తనాలపై చర్యలు తీసుకుంటున్నారు?

ఏవో: ఇప్పటికే అన్ని ఎరువులు, విత్తనాలను దుకాణాలను తనిఖీ చేశాం. డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

ఆంధ్రజ్యోతి : కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి రైతుభరోసా కోసం ఎప్పటి వరకు దరఖాస్తులు తీసుకుంటున్నారు?

ఏవో: ఈనెల 20లోపు మండల వ్యవసాయ అధికారికి జిరాక్స్ కాపీలు అందజేయాలి.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



గుర్రంపోడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇటీవల విడు దల చేసిన పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఫలితాల్లో మన్న వేణుగోపాల్ న్యాయ విభాగంలో 65వ ర్యాంకు సాధించారు. గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామ మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న వేణుగోపాల్ 2024లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. కాగా వేణుగోపాల్‌ను కళాశాల బృందం బుధవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూక్, కోఆర్డినేటర్ కోమటి రామకృష్ణ, బజ్జూరి గోవర్ధన్, బోడ వెంకన్న, అతి యా అంజుం, ధార్ల శ్రీలత, సమీనా సుల్తా నా, శ్రీను, శ్రీనయ్యాస య్యద్, రాజు, మరెడ్డి శ్రీలత పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్య తీసుకోవాలి

దేవరకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్య తీసుకోవాలని విద్యార్థి రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షుడు కేతావత్ బాబు రాంనాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యునికి ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఒక ఆయన ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు మద్యం దుకాణాలు, ఫంక్షన్‌హాల్‌కు దగ్గరలో ఉండకూడదని, ప్రధాన రహదారిపై ఉండడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు వంటి నిబంధనలు ఉల్లంఘిం నడుపుతున్నారని పిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్య తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఉపాధి హామీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

చందంపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ సలహాదారులు రమావత్ మోహన్‌కృష్ణ అధికారులను కోరారు. బుధవారం చందంపేట మండలంలో ఉపాధి హామీ అక్రమాలపై కేంద్ర విజిలెన్స్ కమిషన్, పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్లకు నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ తీర్మాణం లేకుండా ఎలాంటి నోటీస్ లేకుండా స్థానిక ఎంపీడీవో, కంప్యూటర్ ఆపరేటర్ రాజకీయ నాయకులతో కుమ్మకై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.